ఈనాడు
అనంతపురం
శుక్రవారం అక్టోబరు 4, 2024

జగనన్న కాలనీ.. రహదారుణం



పదో లేఅవుట్ రహదారిలో రాళ్లు, రప్పలతో అధ్వానంగా ఇలా..

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు పట్టణంలో టిడ్కో అపార్టుమెంట్ ఏరియాలో ఉండే జగనన్న కాలనీ 10వ లేఅవుట్‌లో మౌలిక వసతులు కరవయ్యాయి. కాలనీలో వెళ్లడానికి సరైన రహదారి లేదు. ఇక్కడ చాలా మంది ఇళ్లను నిర్మించుకున్నారు. ఇక్కడికి వెళ్లే దారిలో తగ్గుతో పాటు రాళ్లు ఉండటంతో నడవడానికి లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఒక్క రోడ్డు కూడా వేయలేదు. రాళ్ల రప్పల మధ్య నడక సాగించలేకపోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్త పన్నుపై ఉపశమనం..

- ఉమ్మడి అనంత జిల్లాలో నెలకు రూ.1.11 కోట్లు వసూలు
- ప్రభుత్వమే క్లాప్ నిర్వహణ

పురవాసులపై తప్పిన ఆర్థిక భారం

ఈనాడు, అనంతపురం –న్యూస్‌టుడే, అనంత నగరపాలక

పట్టణవాసులకు గుదిబండలా మారిన చెత్తపన్నును రద్దు చేస్తూ తెదేపా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ ఈనెల 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేశారు. వెంటనే అమల్లోకి తీసుకు రావడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పురపాలక వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వైకాపా ప్రభుత్వంలో చెత్తపన్ను వసూళ్లలో లక్ష్యాలు పూర్తిచేయలేక ఇబ్బందులు ఎదుర్కొన్న వార్డు సచివాలయాల సిబ్బంది సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగన్ పాలనలో నోటీసులు అందుకున్న శానిటేషన్ కార్యదర్శులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో అనంతపురం, హిందూపురం, కదిరి, ధర్మవరం, గుంతకల్లు పరిధిలోని ప్రజలకు తాజా ప్రకటన ఊరటనిస్తోంది.

ఇక పురపాలిక నిధులతోనే..

గత ప్రభుత్వంలో ఐదు పురపాలికల పరిధిలో మొత్తం 155 చెత్త వాహనాలను అందించింది. వాటి ద్వారా నిత్యం తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించాల్సి ఉన్నా... సక్రమంగా అమలు చేయలేదు. ప్రైవేటు ఏజెన్సీ నిర్లక్ష్యంతో రహదారులపైన చెత్త పేరుకుపోయేది. అయినా ముక్కుపిండి పట్టణవాసుల నుంచి పన్ను వసూలు చేశారు. తెదేపా కూటమి ప్రభుత్వం పట్టణవాసులపై భారం పడకుండా పురపాలిక సాధారణ నిధులతోనే చెత్తసేకరణ చేయనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చెత్తపన్ను రద్దు చేసి పట్టణవాసులకు ఉపశమనం కలిగించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గత వైకాపా ప్రభుత్వంలో చెత్త పన్ను వసూళ్లు ఇలా..

పురపాలిక-కార్పొరేషన్	గృహాలు	చెత్త వాహనాలు	పన్ను (రూ.ల్లో)
అనంతపురం	69,357	60	40,75,680
గుంతకల్లు	31,045	30	24,97,680
హిందూపురం	39,678	25	21,17,740
ధర్మవరం	32,914	25	20,99,540
కదిరి	21,639	15	11,25,280



అనంతపురం: ఇంటింటా చెత్త సేకరణ

రూ.60 నుంచి రూ.10 వేల దాకా..

క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) అమలులో భాగంగా వైకాపా ప్రభుత్వం చెత్తపన్ను తీసుకొచ్చింది. అనంతపురం నగరపాలకతో పాటు హిందూపురం, కదిరి, ధర్మవరం, గుంతకల్లు మున్సిపాలిటీల్లో చెత్తసేకరణ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఇందుకుగాను వినియోగదారుల రుసుం కింద గృహ సముదాయాల నుంచి పన్ను వసూలు చేశారు. పేదల ఇళ్ల నుంచి నెలకు రూ.60, మధ్య తరగతి వారి నుంచి రూ.90 తీసుకునేవారు. వాణిజ్యసముదాయాలు, క్లినిక్‌లు, కళ్యాణమండపాలు, హోటళ్ల నుంచి రూ.150 నుంచి రూ.10 వేలు వసూలు చేసేవారు. ఐదు పురపాలికల్లో కలిపి నెలకు రూ.1.11 కోట్లు వసూలు చేయాలని జగన్ ప్రభుత్వం లక్ష్యాలు విధించింది. అందరి నుంచి వసూలు చేయాల్సిందేనని వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించింది. లక్ష్యం చేరని వారికి నోటీసులు జారీ చేసేవారు. గుంతకల్లు, ధర్మవరం, అనంతపురం పరిధిలో చెత్తపన్ను చెల్లించని వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. కొందరికి పించన్ల సొమ్ము నుంచి చెత్తపన్నును మినహాయించుకునేవారు. దీంతో గత ప్రభుత్వంలో పట్టణాల్లోని పేదలు పన్ను కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పన్నును పూర్తిగా రద్దు చేయడంతో ఉపశమనం కలిగింది.

తన్మయం.. తేజోరూపం



అనంతపురం: శివకోటి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం

జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో దేవతామూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి.. అమ్మవార్లను దర్శించుకుని తరించారు.

-న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలనలో నిర్లక్ష్యం వద్దు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఆదేశాల ప్రకారం 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించిన అసైన్డ్ ఫ్రీహోల్డ్ భూముల క్షేత్ర పరిశీలన వేగవంతంగా సాగాలి. ఈ ప్రక్రియకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. ఏ దశలోనూ నిర్లక్ష్యం ప్రదర్శించొద్దు.. అని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయం నుంచి జేసీ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, సహాయ కలెక్టర్ వినూత్న, తదితరులతో కలిసి వీక్షణ సమీక్ష జరిపారు. 22ఏ నిషేధిత భూముల విముక్తిపై పునఃపరిశీలన, ప్రజా వేదిక అర్జీలు, బదిలీలు అంశాలపై మాట్లాడారు. జిల్లాలో తాజాగా పెరిగిన గణంకాల ప్రకారం జిల్లాలో 34,485.89 ఎకరాలు అసైన్డ్ నుంచి విముక్తి కల్పించారు. ఇందులో 178.73 ఎకరాలు రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసిన భూములను పునః పరిశీలన పూర్తి అయింది. ఫ్రీహోల్డ్ భూముల పునఃపరిశీలన ప్రక్రియను వేగంగా చేపట్టాలి. ఈనెల 5లోపు పూర్తి చేయాలన్నారు. కుందుర్పి, పామిడి మండలాలు చాలా వెనుకపడ్డాయి. తొలి ప్రాధాన్యంగా పరిశీలనను పూర్తి చేయాలన్నారు.

'సెక్టోరియల్ నియామకాలపై విచారణ జరిపించాలి'

అనంతపురం విద్య: సమగ్రశిక్షా కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఉద్యోగాల నియామక ప్రక్రియపై విచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. అనంత జిల్లాకు చెందిన విద్యాశాఖ, సమగ్రశిక్షా పథకం విభాగాల ఉన్నతాధికారులు ఆ ఉద్యోగాల నియామకాల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా అభ్యర్థులను మౌఖిక పరీక్షకు పిలిచారన్నారు. గతంలో సస్పెండ్ అయిన ఉపాధ్యాయులకు సెక్టోరియల్ ఉద్యోగాలు కట్టబెట్టడానికి రంగం సిద్ధం చేశారని ఆరోపించారు. విచారణ జరిపించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నగరంలోని ఎన్‌సీసీఎస్ఏఐ పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్లు, గదుల వివరాలు పరిశీలిస్తున్న టెట్ అభ్యర్థులు

టెట్‌కు 2038 మంది హాజరు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం ఆరంభమైంది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజుల ఉదయం 8 కేంద్రాలు, మధ్యాహ్నం 7 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. అనంతపురం, తాడిపత్రి, గుత్తి, బెంగళూరులో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 1,235 మందికి 1,075 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 1,070 మందికి 963 మంది హాజరయ్యారు. మొత్తం 2,305 మందికి 2,038 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ నెల 21 వరకూ టెట్ పరీక్షలు జరగనున్నాయి.

గాలీవాన బీభత్సం



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న చందమూరు వంక

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: చెన్నేకొత్తపల్లి పరిసరాలలో బుధవారం రాత్రి గాలి, వడగండ్లవాన బీభత్సం సృష్టించింది. ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి ఎన్నడూ లేని విధంగా కుంభవృష్టి కురిసింది. రాత్రి 9 గంటలకు చినుకులతో ప్రారంభమైన ఏకధాటిగా గంటన్నర సేపు వడగండ్లవాన కురిసింది. రాత్రి 11 గంటలకు మరోసారి ప్రారంభమైన వాన 2.30 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. వాగులు, వంకలు ఉప్పొంగాయి. వడగండ్ల వాన బీభత్సానికి 44 జాతీయ రహదారి పక్కన ఉన్న దుకాణ షెడ్లు దాదాపు 150 మీటర్ల దూరం ఎగిరిపోయి పొలాల్లో పడ్డాయి. ఆ సమయంలో రహదారిపై వాహన రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బాధితులు ఆంజనేయులు కిరాణా దుకాణంలోని సామగ్రి, షెడ్డుతో కలిపి రూ.70 వేలు, మరో బాధితుడు రాధాకృష్ణ నిర్మాణంలో ఉన్న దుకాణం ఎగిరిపోవడంతో రూ.40 వేల నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన 8 మంది రైతులకు చెందిన 20 ఎకరాల్లోని టమాటా, గోరుచిక్కుడు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఊరకొండ సమీపంలో పలు నియంత్రికలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ముష్టికోవెల చెరువు హంద్రీనీవా జలాలతోపాటు రాత్రి కురిసిన వర్షానికి పూర్తిస్థాయిలో నిండి మరువ పారింది.



చెన్నేకొత్తపల్లి: నేలకొరిగిన విద్యుత్తు నియంత్రిక

శ్రీసత్యసాయి విద్యుత్తుశాఖ సర్కిల్ ఏర్పాటుకు శ్రీకారం

అధికారులను కేటాయిస్తూ ఉత్తర్వులు

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: ఇప్పటి వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు విద్యుత్తుశాఖ సర్కిల్ ఉండేది. వినియోగదారులకు మెరుగైన విద్యుత్తుసేవలు అందించాలని సర్కిల్‌ను రెండుగా విభజించింది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా సర్కిల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో అనంత సర్కిల్‌కు 58 మంది, సత్యసాయికి 55 మంది అధికారులను కేటాయించారు. ఈనెల 2లోపు విభజన ప్రక్రియ పూర్తి చేసి కార్యాలయం ప్రారంభించాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ఆదేశాలు జారీ చేశారు. కాగా కార్యాలయ భవనాన్ని గుర్తించలేదు. కొత్తగా పోస్టులు కేటాయించకుండా ఉన్న వారినే నూతన సర్కిల్‌కు సర్దుబాటు చేయటంతో ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఎస్ఈ, డీఈటీ, ఎస్ఏవో, ఏవో పోస్టులనే నూతనంగా ఎస్పీడీసీఎల్ నుంచి కేటాయించారు. ఈఈ, డీఈఈ, ఏఈ, ఏఏవో పోస్టులను అనంత సర్కిల్ నుంచి సత్యసాయి సర్కిల్‌కు సర్దుబాటు చేశారు.

ప్రాంతాలు ఇలా..

శ్రీసత్యసాయి విద్యుత్తుశాఖ సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని పరిధిలో కదిరి, హిందూపురం ఉండగా ప్రస్తుతం అనంతపురం రూరల్ డివిజన్‌ను కొత్త సర్కిల్‌లోకి కలపటంతో పాటు పుట్టపర్తి కేంద్రంగా డివిజన్‌ను ఏర్పాటు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. బత్తలపల్లి, తాడిమర్రి మండలాలను రూరల్ డివిజన్‌లోకి మార్పు చేయనున్నారు.

ఉద్యోగ సంఘాల వినతులు

ఉన్నఫళంగా నూతన సర్కిల్‌ను ఏర్పాటు చేసి బదిలీలు చేపడితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అధికారులు, ఉద్యోగులు నష్టపోకుండా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి... వారి సూచనల మేరకు విభజన ప్రక్రియ చేపట్టాలని సంఘాల నేతలు ఎస్పీడీసీఎల్ సీఎండీని కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ మేరకు తెలుగునాడు విద్యుత్తు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటేశ్ గురువారం విద్యుత్తుశాఖ ఎస్ఈని కలిసి విన్నవించారు.

గ్రూపు-4 క్రీడా కోటాపై పరిశీలన

- ☛ ఇద్దరు అభ్యర్థులు గైర్హాజరు
- ☛ 'ఈనాడు' కథనంతో కదలిక


జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఎట్టకేలకు ఏపీపీఎస్సీ గ్రూపు-4 క్రీడా కోటా వ్యవహారంలో కదలిక వచ్చింది. నిర్దేశిత ధ్రువీకరణ పత్రాల దాఖలు, పరిశీలన కోసం మొత్తం 15 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. ఇద్దరు గైర్హాజరయ్యారు. తక్కిన 13 మంది వచ్చి విద్యార్హత, క్రీడల ధ్రువీకరణ పత్రాలను సమర్పించారు. గురువారం కలెక్టరేట్ ఎ సెక్షన్‌కు వచ్చి సంబంధిత అధికారులకు అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ క్రీడా కోటా కింద ఉన్న ఒక పోస్టు భర్తీలో తీవ్ర జాప్యం జరగడం, ఈ బాగోతంలో అనేక మలుపులు తిరగడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే వ్యవహారంపై ఈనెల 2న 'ఒక్క పోస్టు... మలుపులెన్నో!' అన్న కథనాన్ని 'ఈనాడు' ప్రచురించింది. ఇది అధికార వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ప్రభుత్వ జీవో, మార్గదర్శకాలకు విరుద్ధంగా కొన్ని తతంగాలు గుట్టుచప్పుడు కాకుండా చోటు చేసుకోవడం విశేషం. ప్రభుత్వ జీవో 74 ప్రకారం క్రీడా కోటా కింద అర్హత సాధించిన వారికి రాత పరీక్షలో కనీసం 40 శాతం మార్కులు రావాలి. అంటే.. 300 మార్కుల్లో కనీసం 120 మార్కులు తప్పనిసరి. తాజాగా హాజరైన 13 మందిలో... ఏడుగురికి కనీస మార్కులు లేనట్లు తెలుస్తోంది. కనీస మార్కుల కంటే తక్కువ వచ్చిన వారి పత్రాలను శాప్‌కు పంపకూడదు. ఇలా అనేక లోపాలు, పొరపాట్లను పూర్తి స్థాయిలో పరిశీలన చేసిన తర్వాతే అర్హత కల్గిన వారి జాబితాను శాప్‌కు పంపనున్నారు.

తాత్కాలికంగా ఆర్టీసీ బస్సు పాసుల జారీ నిలిపివేత

అనంతపురం ఆర్టీసీ: అనంతపురం ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో విద్యార్థులతో పాటు అన్ని రకాల బస్సు పాసులు తాత్కాలికంగా నిలిపివేశామని డిపో మేనేజరు నాగభూపాల్ తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఆధునికీరణ చేస్తుండటంతో www.apsrtcpass.in ఈ నెల 5, 6 వతేదీల్లో నిలిపివేశారు. 7 నుంచి యథాతథంగా బస్‌పాసులు కౌంటర్ల వద్ద ఇవ్వనున్నామన్నారు. విద్యార్థులు, ప్రయాణికులు సహకరించాలని కోరారు.

చిత్రం.. సమాజ సందేశం

ఆదర్శంగా విశ్రాంత రైల్వే ఉద్యోగి



ఆంజేయస్వామి చిత్రాన్ని వేస్తున్న శ్రీధరన్

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లుకు చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి శ్రీధరన్ చిత్రలేఖనంలో రాణిస్తున్నారు. ఏటా వేసవిలో బాల బాలికలకు చిత్రలేఖనంపై ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తూ కళను పది మందికి పంచుతున్నారు. 15 ఏళ్లుగా నిర్విఘ్నంగా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. జల, వాయు కాలుష్యం, మొక్కల పెంపకం, మట్టి విగ్రహాలు, బాల్య వివాహాలు, వయోజన విద్య, నీటిని పొదుపు, వంటి అంశాలను తీసుకొని కుంచెతో చిత్రాలు వేస్తూ సమాజాన్ని మేలుకొలుపుతుంటారు.

గిన్నిస్ బుక్ ప్రశంసలు

2022 ఏప్రిల్‌లో గిన్నిస్ బుక్ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో పాల్గొని ఆంజనేయస్వామి చిత్రాన్ని వేశారు. ఈ మేరకు నిర్వాహకుల నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. మరో పోటీలో లండన్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ నుంచి 2024 జులైలో ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని వివిధ సంస్థలు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని బహుమతులు, పతకాలు సాధించారు.



ప్రశంసాపత్రం

కళను పది మందికి పంచుతున్నా..

బాల్యం నుంచి చిత్రాలు గీయడమంటే ఇష్టం. ఈ కళను శిబిరాల ద్వారా పది మందికి పంచుతున్నా. సామాజిక అంశాలను తీసుకొని చిత్రాలు వేయడం అలవాటు చేసుకున్నా. - **శ్రీధరన్, చిత్రకారుడు**

ఉద్యాన పంటలు.. రాబడి మార్గాలు

సాగుపై అన్నదాతల మొగ్గు

గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : మారుతున్న కాలంతో పాటు అన్నదాతల ఆలోచనల్లోనూ మార్పులొస్తున్నాయి. సాధారణ పంటల సాగు కన్నా ఉద్యాన పంటలతో ఎక్కువ లాభాలు గడించొచ్చనే ఉద్దేశంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ఆలోచనలకు అనుగుణంగా రాయితీతో సాగును ప్రోత్సహిస్తోంది. ఉపాధి పథకం ద్వారా రైతులకు తోడ్పాటును కల్పిస్తోంది. మొత్తం 16 రకాల మొక్కలు మామిడి, దానిమ్మ, జామ, సపోటా, చీనీ, డ్రాగన్ ఫ్రూట్స్, అల్లనేరేడు, చింత, టెంకాయ, తైవాన్ జామ లాంటి పండ్ల రకాలను రైతులకు అందించి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

ఇప్పటివరకు నాటిన మొక్కల వివరాలు

మండలం	రైతుల వివరాలు	సాగు (ఎకరాల్లో)
గుమ్మఘట్ట	52	172.00
రాయదుర్గం	49	152.26
బొమ్మనహాళ్	18	39.66
డి.హిరేహాళ్	49	131.00
కణేకల్	12	31.60

- రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోనే దాదాపుగా 3940.52 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేశారు. రికార్డు స్థాయిలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు మండలంలో మొత్తం 1016.45 ఎకరాల్లో 267 మంది రైతన్నలు పండ్ల మొక్కలు నాటారు.
- హార్టికల్చర్ హబ్‌గా పేరున్న కళ్యాణదుర్గం ప్రాంతంలో మొత్తం 1037 మంది రైతులు 3463.72 ఎకరాల్లో రికార్డు స్థాయిలో పండ్ల మొక్కలు నాటారు.



కళ్యాణదుర్గం : హులికల్లులో మొక్కలు నాటుతున్న రైతులు

మూడేళ్ల పాటు ప్రభుత్వ ప్రోత్సాహం

మామిడి మొక్కలు రైతు నాటుకుంటే ప్రతి ఎకరాకు 70 మొక్కలు ఉచితంగా అందిస్తారు. గుంతలు తవ్వుకునేందుకు రూ. 16 వేలు, మొక్కలు నాటేందుకు రూ. 1,100, ప్రతినెలా మూడు సార్లు నీరు పోసేందుకు రూ. 1260లు మూడేళ్ల పాటు ఇస్తారు.

ఎమ్మెల్యే సురేంద్రబాబుకు పురస్కారం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అరుదైన గౌరవం దక్కింది. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎన్నారై వెల్ఫేర్ సొసైటీ వారిచే గ్లోబల్ ఇండియన్స్‌కి అందించే ప్రతిష్ఠాత్మకమైన మహాత్మాగాంధీ లీడర్‌షిప్ అవార్డును కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, యూకే లోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ మ్యూజియంలో అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నియోజకవర్గ ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. ఆయన వెంట మిత్రుడు దేవినేని రాజగోపాల్ ఉన్నారు.



పురస్కారం అందుకుంటున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : ఎంపీ

పరిగి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. గురువారం పరిగిలో ఎంపీ నిధులు రూ.కోటితో చేపట్టనున్న వాల్మీకి కళ్యాణ మండపానికి ఎంపీ బీకే పార్థసారథి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేయస్సు కోసం కష్టపడిన కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. వ్యక్తులకన్నా పార్టీ గొప్పదన్నారు. పార్టీని కాపాడు కోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సీఎస్‌ఆర్ గ్రాంటు ద్వారా నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సాధికార కమిటీ సభ్యులు ఈశ్వరప్ప, పరిగి సంఘం అధ్యక్షుడు కేడీ కిష్టప్ప, ట్రెజరర్ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి సోము, న్యాయవాది శివశంకర్, చంద్ర, రొద్దం మండలం నరహరి, అనిల్‌కుమార్, నరసింహులు, కన్నప్ప, సురేష్, రాజు, మూర్తి, తెలుగు మహిళలు, వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

సాళువ పాలకులు చాళుక్య వంశవారసులే..

గోరంట్ల, న్యూస్‌టుడే: విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన రెండో రాజ వంశం సాళువ పాలకులు చాళుక్య వంశ వారసులని చరిత్రకారుడు మైనాస్వామి పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మాధవరాయ ఆలయ ముందుభాగంలో ఉన్న రాతిఫలక శాసనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవరాయస్వామి సేవలకు భూదాన ఇస్తూ శాసనాన్ని సాళువ నరసింగరాయలు రాయించినట్లు వెల్లడించారు. వారు చాళుక్యవంశ వారసులుగా శాసనంలో పేర్కొన్నారన్నారు. తొలుత చంద్రగిరి, అనంతరం పెనుకొండ సీమరాజ ప్రతినిధిగా పనిచేసిన సాళువ 1485 నుంచి 1491 వరకు విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా పాలించినట్లు చెప్పారు. సంస్కృత శాసనాన్ని సుందరమైన తెలుగులో రాశారన్నారు. శాసనం పైభాగంలో సుదర్శన చక్రం, సూర్యుడు, చంద్రుడు, శంకు బొమ్మలు ఉన్నాయన్నారు. సాళువ నరసింగరాయలను చాళుక్య వంశ వారసులుగా వివరిస్తున్న ఏకైక శాసనం ఇదేనని, రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



సాళువ చరిత్రను వివరిస్తున్న మైనాస్వామి



అగళి చెరువుకు సువర్ణముఖి నీరు

కర్ణాటకలో ఎగువ సిద్దరకొండ పరిసరాల్లో వర్షాలు భారీగా కురవడంతో సువర్ణముఖి నది ఉప్పొంగి ప్రవహించింది. గురువారం నదీ జలాలు కర్ణాటకలోని సజ్జేహాసహళ్లి నుంచి బైపాస్ కాలువ ద్వారా అగళి చెరువుకు చేరుతున్నాయి. **-న్యూస్‌టుడే, అగళి**

గుంతకల్లు మీదుగా వారంలో రెండు రైళ్లు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు మీదుగా వారంలో రెండు సార్లు రెగ్యులర్‌గా ప్రయాణించే రైళ్ల రాకపోకలు ఈనెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ రైళ్లు సికింద్రాబాదు నుంచి గుంతకల్లు మీదుగా గోవాకు వెళ్తాయని డివిజన్ అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాదులో ప్రతి బుధ, శుక్రవారాల్లో, గోవా నుంచి గురు, శనివారాల్లో రైళ్లు బయలు దేరనున్నాయి. సికింద్రాబాదులో రైలు (17039) ఉదయం 10.05కు బయలుదేరి డోన్‌కు మధ్యాహ్నం 3.25, గుంతకల్లుకు సాయంత్రం 5.05 గంటలకు వచ్చి, గోవాకు తెల్లవారు జామున 5.45కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు (17040) గోవాలో ఉదయం 9 గంటలకు బయలుదేరి గుంతకల్లుకు రాత్రి 8.55, డోన్‌కు 10.50కు వచ్చి సికింద్రాబాద్‌కు ఉదయం 6.20కు చేరుకుంటుందని అధికారులు పేర్కొన్నారు. రైళ్లకు మొదటి తరగతి, రెండో, మూడో తరగతి, శీతల బోగీలు, స్లీపర్, జనరల్ కోచ్‌లు ఉంటాయని అధికారులు వివరించారు. రైళ్లు కర్నూలు, బళ్లారి, హోస్‌పేట, హుబ్లీ మీదుగా ప్రయాణించనున్నాయి.

లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా అనంత ఎంపీ

అనంతపురం(కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే: కేంద్ర లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణను నియమించారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఛైర్మన్‌గా బసవరాజు బొమ్మాయి నియమించగా, లోక్‌సభకు చెందిన 21 మంది, రాజ్యసభకు 10 మంది చొప్పున ఎంపీలు ఉన్నారు. వీరిలో కమిటీలో సభ్యుడిగా నియమించడంపై ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే కేంద్రం ఓబీసీ, సిల్క్‌బోర్డు సంక్షేమ సభ్యులుగా నియమించారని ఎంపీ గుర్తు చేశారు. తాజాగా కమిటీలో సభ్యుడిగా ఎన్నుకున్నందుకు దేశ ప్రధాని మోదీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబులకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు తక్షణ ప్రవేశాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 5న తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య నరసింహన్ తెలిపారు. ఐసెట్-2024 అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రవేశాల విభాగం వద్దకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

'కేతిరెడ్డి అహంకారమే ఈ స్థితికి దిగజార్చింది'



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణయాదవ్, నాయకులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అహంకారమే ఈ స్థితికి దిగజార్చిందని ఎంపీపీ ఆదినారాయణయాదవ్ విమర్శించారు. మంత్రి సత్యకుమార్‌పై కేతిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై గురువారం ఎంపీపీ, భాజపా నాయకులు ముదిగుబ్బలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎవరు ప్రజలను మోసం చేశారో, కబ్జాలకు పాల్పడి, కమీషన్లు దండుకున్నారో ప్రజలకు తెలుసునని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేయించిన ఘటనలు ఇంకా మరచిపోలేదన్నారు. నైతిక విలువల గురించి కేతిరెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎంపీపీ ఎద్దేవా చేశారు. సమావేశంలో భాజపా నాయకులు వీరాంజనేయులు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు'

కొత్తచెరువు, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో మీనాక్షి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ నెల 13వ తేదీ వరకు అన్ని పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని తెలిపారు. డీవైఈవోలు, ఎంఈవోలు ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహించినట్లు వచ్చిన ఫిర్యాదులపై పరిశీలన జరిపి నివేదిక అందించాలని డీఈఓ కోరారు.

ఆశాజనకంగా టమాటా ధర

అనంతపురం(వ్యవసాయం): టమాటా ధర రోజూ పెరుగుతూనే ఉంది. సాగు చేసి పూత, కాయ దశల్లో ఉన్న రైతులు ఎప్పుడెప్పుడు పంట కోత కొస్తుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. పంట కోతలు తగ్గాయని, ప్రస్తుతం ధరలు తగ్గే పరిస్థితి ఉండదని వ్యాపారవర్గాలు తెలిపాయి. అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌లోని 18 మండీలకు గతంలో భారీగా టమాటా వచ్చేది. వారం నుంచి సరకులు పూర్తిగా తగ్గింది. గురువారం మార్కెట్‌కు కేవలం 650 టన్నులు వచ్చాయి. కిలో గరిష్ఠం రూ.77, మధ్యస్థం రూ.67, కనిష్ఠం రూ.51 చొప్పున ధరలు పలికాయి. 15 కిలో బుట్ట ధర చూస్తే గరిష్ఠం రూ.1,170, మధ్యస్థం రూ.1,005. కనిష్ఠం రూ.765 చొప్పున ధరలు పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలిపారు.

వాహనాలు రావు.. సమాచారం చెప్పరు!

విసుగెత్తిన కార్డుదారులు

అనంతపురం, (కళ్యాణదుర్గం రోడ్డు) న్యూస్‌టుడే: ఎండీయూ వాహనాలు తిరగవు. ఎక్కడ సరకులు ఇస్తారన్న సమాచారం అసలు చెప్పరు. కార్డుదారులంతా చౌకధరల దుకాణాల చుట్టు సంచులు పట్టుకుని నిత్యం తిరుగుతున్నారు. ఈ విషయంలో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 3,012 చౌకధరల దుకాణాల పరిధిలో 12,08,293 తెల్లకార్డుదారులు ఉన్నారు. ఈనెల 18 వేలమెట్రిక్ టన్నులు బియ్యం 650 మెట్రిక్ టన్నులు పంచదార, 800 మెట్రిక్ టన్నులు కంది పప్పు, కార్డుకు మూడు కిలోల చొప్పున జొన్నలు 3,624 టన్నులు ఇస్తున్నారు. ఏ డీలరు ఎప్పుడు ఎక్కడ సరకులు పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితి. ఏ కార్డు ఏ డీలరు పరిధిలో ఉందో తెలియదు. మూడు నెలల నుంచి కార్డులు, సంచులు పట్టుకుని లబ్ధిదారులు పరుగులు తీయాల్సిన పరిస్థితి. గత వైకాపా ప్రభుత్వం హయాంలో ప్రతి సచివాలయానికి ఎండీయూ వాహనాన్ని మ్యాచింగ్ చేశారు. డీలరు వద్ద ప్రతి నెలా ఎండీయూ ఆపరేటర్, వీఆర్వో సంతకం ఈ-పాస్ యంత్రంలో వేలిముద్ర వేయాల్సిందే. ఒక డీలరు తర్వాత ఒక్కరు సరకులు పంపిణీ చేస్తున్నారు. సమస్య మరింత జఠిలమవుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. కార్డుదారుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది.



అనంతపురం గ్రామీణం: విద్యారణ్యనగర్‌లో చౌకదుకాణం ముందు వరసలో సంచులు, కార్డులు

అరటి రైతుల ఆదాయం పెంపునకు చర్యలు

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : రాయలసీమలో ఉద్యాన హబ్‌గా మార్చాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమని, ప్రధానంగా అరటి నాణ్యత పెంచడమే కాకుండా రైతులకు ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉద్యానశాఖ సంయుక్త సంచాలకులు దేవమునిరెడ్డి పేర్కొన్నారు. అనంతపురం, కడప, నంద్యాల జిల్లాల ఉద్యానశాఖ అధికారులతో పాటు అరటి పంట అమ్మకందార్లు, కొనుగోలుదారులకు కార్యశాల నిర్వహించారు. ఆయా జిల్లాలో 64 వేల ఎకరాల్లో అరటి సాగవుతోందని, మొత్తం రూ. 12.80 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తోందని, అయితే మార్కెటింగ్, అరటి నాణ్యత లేక రైతులు నష్టపోతున్నారన్నారు. అరటి నాణ్యత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రధానంగా గ్రామాలు, క్లస్టర్ల వారీగా అరటి నాణ్యత పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. అనంతపురం, నంద్యాల జిల్లాల ఉద్యానశాఖ అధికారులు నరసింహారావు, నాగరాజు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యానశాఖ జేడీ దేవమునిరెడ్డి, డీడీహెచ్‌లు నరసింహారావు, నాగరాజు, తదితరులు

రేపు పీఎం కిసాన్ సొమ్ము జమ

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : ఈనెల 5న పీఎం కిసాన్ సొమ్ము రైతులకు ఖాతాలకు జమ చేయనున్నారు. ఒక్కో రైతుకు రూ. 2 వేల చొప్పున దేశ ప్రధాని నరేంద్రమోదీ డీబీటీ ద్వారా నేరుగా రైతు ఖాతాల్లోకి జమ చేస్తారు. జిల్లాలో మొత్తం 2,79,161 మంది రైతులకు రూ. 55.83 కోట్లు లబ్ధి చేకూరనుంది. అదే రోజు జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో ప్రధాని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. రైతులంతా హాజరైన విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ విజ్ఞప్తి చేశారు.

సహజ కాన్పని కాలయాపన..

గర్భంలోనే శిశువు మృతి!

రాత్రంతా ప్రసవ వేదన.. కుటుంబ సభ్యులు ఆందోళన



మైథిలి

హిందూపురం, న్యూస్‌టుడే: ప్రసవానికి వచ్చిన మహిళ గర్భంలోనే శిశువు మృతి చెందిన ఘటన హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. హిందూపురం పట్టణం మేళాపురానికి చెందిన మైథిలి బుధవారం ప్రసవానికి ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. ఆసుపత్రిలో చేర్చుకొన్నప్పటికీ ప్రసవం చేయకుండా సహజ కాన్పు అవుతుందని సిబ్బంది కాలయాపన చేశారు. వైద్యులు అందుబాటులో లేకపోవటంతో ఆమె రాత్రంతా ప్రసవవేదన పడిందని గర్భిణి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం వైద్యులు శస్త్రచికిత్స చేసి శిశువును బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఉమ్మనీరు తాగటంతో శిశువు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వైద్యులు సకాలంలో శస్త్రచికిత్స చేసి ఉంటే బిడ్డ బతికేదని బాధితురాలి బంధులువుల ఆందోళన వ్యక్తం చేశారు.

యువతి అపహరణకు యత్నం

శింగనమల, న్యూస్‌టుడే : శింగనమల మండలం చీలేపల్లి గ్రామానికి చెందిన ఓ యువతిని అపహరణకు యత్నించిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు గార్లదిన్నె మండలం కొప్పలకొండకు చెందిన సోమశేఖర్‌తో యువతికి గత రెండు నెలల క్రితం నిశ్చితార్థం చేశారు. నిశ్చితార్థం అనంతరం చరవాణిలో అసభ్యకరంగా మాట్లాడిన సోమశేఖర్ ప్రవర్తన సరిగా లేదని సదరు యువతి తల్లిదండ్రులకు వివరించింది. దీనిపై ఇరు కుటుంబాల వారు చర్చించుకొని వివాహాన్ని రద్దు చేయాలని నిర్ణయించుకున్నారు. అయినా సోమశేఖర్ తరుచూ యువతిని చరవాణిలో వేధిస్తుండేవాడు. ఈక్రమంలో యువకుడు గురువారం ఉదయం చీలేపల్లి గ్రామానికి కొంతమంది యువకులతో వచ్చి యువతిని అపహకరించేందుకు యత్నించాడు. కుటుంబసభ్యులు అప్రమత్తం కావడంతో వెనక్కి వెళ్లిపోయారు. గ్రామస్థులు కలిసి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం యువతి స్థానిక సీఐ కౌలుట్లయ్యకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేపట్టామని సీఐ తెలిపారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

రొద్దం, న్యూస్‌టుడే : మండలంలోని తాడింగిపల్లిలో గురువారం గంగాధర్(46) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధర్ గ్రామంలో అప్పులు చేసి 8 నెలల కిందట భార్య సునిత, ఇద్దరు పిల్లలతో కలసి పావగడలోని అనుమయ్య పాళ్యంలో నివాసం ఉంటున్నాడు. గురువారం రేషన్ కోసం తాడింగిపల్లికి వచ్చాడు. తల్లి లక్ష్మీదేవమ్మతో ఆకలి అవుతుంది భోజనం పెట్టుకురమ్మని చెప్పి అతడి సొంత ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లికి అనుమానం వచ్చి స్థానికుల సాయంతో తలుపులు తీసి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. రొద్దం హెడ్‌కానిస్టేబుల్ మారుతి, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రెండో పెళ్లి చేసుకున్న భర్తపై కేసు

గుత్తి, న్యూస్‌టుడే : తనను కాదని మరో యువతిని రెండోపెళ్లి చేసుకున్న భర్తపై గురువారం పోలీసులకు మొదటి భార్య ఫిర్యాదు చేసింది. గుత్తి మండలంలోని బాచుపల్లి జంగాల కాలనీకి చెందిన వెంకటేశ్ ఏడాది కిందట నందిని అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఆ సమయంలో ఆమె తల్లిదండ్రులు కట్నం ఇవ్వలేదు. కట్నం లేకుండా పెళ్లి చేసుకున్నానని, ఆమెను భర్త వేధిస్తూ గతనెల 29న తన మేనత్త కుమార్తెను రెండో పెళ్లి చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య తన భర్తతోపాటు వెంకటేశ్ మేనత్త, మామ, రెండో భార్యపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇంజెక్షన్ వికటించి వ్యక్తి మృతి

మృతదేహంతో బంధువుల నిరసన

నార్పల, న్యూస్‌టుడే : నార్పల ప్రభుత్వ వైద్యశాలలో వేసిన ఇంజెక్షన్ వికటించి కుళ్లాయప్ప(38) మృతి చెందాడని, అతని బంధువులు, దళిత సంఘాల నాయకులు గురువారం ఆందోళనకు దిగారు. నార్పలకు చెందిన కుళ్లాయప్పకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. గురువారం తెల్లవారుజామున కుళ్లాయప్ప తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో నార్పల వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్సు ఇంజెక్షన్ ఇచ్చారు. ఆతర్వాత కొన్ని గంటలకే కుళ్లాయప్ప మరణించాడని అతని బంధువులు ఆరోపించారు. తెల్లవారుజామున నర్సుకు బదులుగా ఆమె భర్త ఇంజెక్షన్ వేయడం వల్లే మృతిచెందాడని దళిత సంఘాల నాయకులు వైద్యశాల ఎదుట ఆందోళనకు దిగారు. సీఐ కౌలుట్లయ్య ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కుళ్లాయప్పకు దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఈక్రమంలో మృతి చెందాడని చెప్పారు. ఇంజెక్షన్ వికటించడం వల్ల కాదని స్పష్టం చేశారు. ఇంజెక్షన్‌ను స్టాఫ్‌నర్సు వేశారని, ఇతరులెవ్వరూ వేయలేదని ధ్రువీకరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లప్ప, సీపీఐ నాయకులు గంగాధర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే కుళ్లాయప్ప మరణించడానికి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఉందని విచారణలో తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. అనంతరం బాధిత కుటుంబంతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చరవాణిలో మాట్లాడి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు, దళిత సంఘాల నాయకులు

గోడ కూలి చిన్నారి దుర్మరణం



పార్థసారథిరెడ్డి

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మోదుగులకుంట గ్రామంలో గోడ కూలి పార్థసారథిరెడ్డి(4) అనే చిన్నారి మృతిచెందాడు. గ్రామస్థులు, బంధువుల వివరాల మేరకు.. శివానందరెడ్డి, రజనీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. వారి ఇంటి సమీపంలో ఉన్న చెట్టు వేర్లు గోడలోకి చొచ్చుకుపోయి పూర్తిగా దెబ్బతిని ఊగుతోంది. గురువారం చిన్నారి చెట్టు వద్దకు వెళ్లి ఆడుకుంటుండగా గోడ కూలి మీద పడింది. తండ్రి, గ్రామస్థులు చిన్నారిని వెంటనే ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఇద్దరు ఆడపిల్లల తరువాత పుట్టిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

'విద్యుత్తు ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి'

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం వేసేందుకు విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోందని, వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న వైకాపా ప్రజలపై తీవ్ర భారం మోపడం, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడంతో ప్రజలు కూటమికి అధికారం కట్టబెట్టారన్నారు. ఇప్పుడు ఇలా ప్రజలపై భారం మోపే ఎలాంటి చర్యలైనా ఖండిస్తామని స్పష్టం చేశారు. నాయకులు కొట్రేశ్, తిప్పేస్వామి, నరసింహులు, నాగరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ ఏఈగా నరసింహులు

రాయదుర్గం: రాయదుర్గం మున్సిపల్ ఏఈగా నరసింహులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా గూడూరు నుంచి రాయదుర్గానికి బదిలీపై వచ్చారు. రాయదుర్గానికి ధర్మవరం నుంచి ప్రతాప్ మరొక ఏఈని నియమించారు. కర్నూలు కార్పొరేషన్ నుంచి రవి ప్రకాష్ నాయుడును రాయదుర్గం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా నియమించారు. రాయదుర్గం ఇన్‌ఛార్జి డీఈగా కొనసాగుతున్న పొరాల సురేష్‌ను గుంతకల్లుకు నియమించారు.

ఉరవకొండలో మోస్తరు వర్షం

ఉరవకొండ: ఉరవకొండలో బుధవారం రాత్రి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో నానా అవస్థలు పడ్డారు. దాదాపు గంట తరువాత సరఫరాను పునరుద్ధరించారు. వర్షంతో పట్టణంలోని వీధులు జలమయం అయ్యాయి.



కంబదూరు: నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

సిబ్బందిపై వేధింపులు ఆపాలి

కంబదూరు, న్యూస్‌టుడే: తపాలా సిబ్బందిపై వేధింపులు ఆపకపోతే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని తపాలా యూనియన్ నాయకులు శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక తపాలా కార్యాలయం వద్ద సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. వేధింపులు, కర్యోగాని ఆన్‌లైన్ కోర్సులను వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండల వ్యాప్తంగా భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టాలని యూనియన్ సభ్యులు పిలుపునిచ్చారు. తపాలా సిబ్బంది శ్రీనివాసులు, మల్లేశ్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై పశువులు రానీవద్దు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: రహదారులపై పశువులు, పందులు సంచరిస్తే దూర ప్రాంతాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ తెలిపారు. రోడ్లపై పశువులు సంచరిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. పలితంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పందులు వీధుల్లో సంచరిస్తూ వ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయన్నారు. యజమానులు ఇంటి వద్ద పెట్టుకుని సంరక్షించుకోవాలని, రోడ్డు మీదకు వదిలితే అనంతపురంలోని గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. పందులను పట్టణానికి ఐదు కిలో మీటర్ల దూరంలో షెడ్లు వేసి పెంచుకోవాలన్నారు. ఈనెల 15వ తేదీ లోపు యజమానులు చర్యలు తీసుకోకుంటే చర్యలు తప్పవని వివరించారు.

వేతనాల చెల్లింపునకు డిమాండ్



కేజీబీవి సిబ్బంది సమస్యలను తెలుసుకుంటున్న ఏపీటీఎఫ్ సంఘం నాయకులు

శెట్టూరు, న్యూస్‌టుడే: రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఎంటీఎస్, కేజీబీవీ, ఎమ్మార్సీ ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల ఏపీటీఎఫ్ ఉపాధ్యా సంఘం నాయకులు తెలిపారు. గురువారం కేజీబీవీని సందర్శించారు. వేతనాలు రాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారన్నారు. తక్షణం వేతనాలు మంజూరు చేయాలని మండల ఏపీటీఎఫ్ సంఘ నాయకులు కోరారు.

ఎంపీడీవోగా కొండన్న బాధ్యతలు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలం ఎంపీడీవోగా ఎం.కొండన్న గురువారం బాధ్యతలు చేపట్టారు. సత్యసాయి జిల్లా నల్లమడ నుంచి రాయదుర్గానికి బదిలీపై వచ్చారు. రాయదుర్గం ఈవోఆర్డీ రంగనాయకులు, ఉపాధి ఏపీవో దేవరాజు ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రెవెన్యూ అధికారుల బాధ్యతల స్వీకరణ

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్‌గా శ్యామ్‌రాయ్, రీసర్వే ఉప తహసీల్దార్‌గా లక్ష్మీకాంత నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఉప తహసీల్దార్ బోగనగౌడ్ ఉరవకొండకు, రీసర్వే ఉప తహసీల్దార్ సుజాతను పుట్టపర్తికి బదలీ చేశారు. కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయంలో సివిల్‌సప్లై డీటీగా పనిచేస్తున్న శ్యామ్‌రాయ్‌ని మండల ఉప తహసీల్దార్‌గా, గార్లెదిన్నె రీసర్వే డీటీని బొమ్మనహాళ్ మండల రీసర్వే డీటీగా నియమించారు.

కంబదూరు, న్యూస్‌టుడే: కంబదూరు ఉప తహసీల్దార్‌గా లక్ష్మీనరసింహులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న డీటీ నారాయణస్వామి గుంతకల్లుకు బదిలీ అయ్యారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని తెలిపారు.

సాగుకు సిద్ధం

- విస్తీర్ణం 1.20 లక్షల ఎకరాలు
- ఎదురుచూస్తున్న అన్నదాతలు

విత్తన పంపిణీలో జాప్యం

కణేకల్లు, న్యూస్‌టుడే: ఖరీఫ్ కష్టాలను దాటుకొని రైతులు రబీ సాగుకు సిద్ధమవుతున్నారు. నల్లరేగడి భూముల్లో పప్పుశనగ సాగుకు పొలాలను దుక్కి దున్ని శుభ్రం చేసుకున్నారు. రాయితీ విత్తనం కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సాగుకు వేళాయెనా నేటికీ రాయితీ విత్తనం జాడ కానరాకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు పంపిణీ ఎప్పుడని ఆందోళన చెందుతున్నారు.

● రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో పప్పుశనగ విస్తారంగా సాగవుతోంది. కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, బెళుగుప్ప మండలాల్లో సాధారణంగా 1.20 లక్షల ఎకరాల్లో పప్పుశనగ సాగు చేస్తున్నట్లు అధికారుల అంచనా.

రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో కేటాయింపుల వివరాలు..

మండలం పేరు	కేటాయించిన విత్తనం (క్వింటాళ్లలో)
కణేకల్లు	4,500
బొమ్మనహాళ్	500
డి.హీరేహాళ్	400
ఉరవకొండ	2,500
వజ్రకరూరు	2,300
విడపనకల్లు	1,900
బెళుగుప్ప	2,300

విపణిలో పెరిగిన డిమాండ్

రబీ సాగు నేపథ్యంలో పప్పుశనగ విత్తనానికి డిమాండ్ పెరిగింది. వ్యాపారుల వద్దకు పరుగులు తీసి, వరుస కడుతున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొన్న వ్యాపారులు ధరలను గణనీయంగా పెంచేశారు. మార్కెట్లలో క్వింటాలు పప్పుశనగ రూ.7,200 నుంచి రూ.7,400 పలుకుతుండగా వ్యాపారులు రూ. 8 వేల నుంచి రూ.8,500 వరకు విక్రయిస్తున్నారు. వ్యాపారుల వద్ద విత్తనాలను అప్పుగా తీసుకొన్న రైతులు క్వింటాలుకు రూ.1,100 అదనంగా ధరతో పాటు వడ్డీ భరించాల్సిన దుస్థితి నెలకొంటోందని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ రాయితీ విత్తనం పంపిణీ చేస్తే ధరలు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

● కణేకల్లు మండలంలోనే అత్యధికంగా 28 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందుకు 30 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమున్నట్లు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వ రాయితీ ధరలు ఖరారు చేసి, 14,400 క్వింటాళ్ల పప్పుశనగ విత్తన కేటాయింపులు చేసింది.

● నేటికీ విత్తన నిల్వలు మండల కేంద్రాలకు చేరలేదు. వ్యాపారుల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండానే హడావుడిగా గురువారం రైతు సేవా కేంద్రాల్లో రాయితీ విత్తనానికి పేర్ల నమోదు ప్రక్రియను ప్రారంభించడం గమనార్హం.




మాల్యం వద్ద పప్పుశనగ సాగుకు సిద్ధం చేసిన పొలం

రోజూ నిరీక్షిస్తున్నాం..



30 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేస్తున్నా. రాయితీ విత్తనం కోసం ఎదురు చూస్తున్నా. బయట మార్కెట్‌లో కొనలేకపోతున్నాం. ప్రభుత్వం వెంటనే పంపిణీ చేస్తే బహిరంగ మార్కెట్ ధరలు తగ్గి రైతన్నకు ఊరట కలుగుతుంది. - శివరాజు, రైతు, మాల్యం

ఎక్కువ కేటాయింపులు చేయాలి



బహిరంగ విపణిలో పప్పుశనగ విత్తనాల ధర భారీగా పెరిగింది. వ్యాపారుల వద్ద కొనుగోలు చేయలేని దుస్థితి. ఎక్కువ మంది రైతులకు రాయితీ విత్తనాలు అందేలా ప్రభుత్వం మండలాలకు కేటాయింపులు పెంచాలి. రైతన్నపై భారం పడకుండా చూడాలి. - జయచంద్రారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు, కణేకల్లు

నమోదు ప్రారంభించాం

రైతులకు సత్వరమే పప్పుశనగ విత్తన పంపిణీ చేయాలని మండలాల వారీగా కేటాయింపులు చేశాం. రైతు సేవా కేంద్రాల్లో పేర్ల నమోదు గురువారం ప్రారంభించాం. సొమ్ము చెల్లించి, నమోదు ప్రక్రియ పూర్తవగానే విత్తనం పంపిణీ చేస్తాం. ఐదెకరాల వరకు గరిష్ఠంగా 2 క్వింటాళ్ల విత్తనం పంపిణీ చేస్తాం.

- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారిణి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: తట్రకల్లులో శుద్ధజల కేంద్రం మూతపడటంతో ఇబ్బందిగా ఉంది. - **పవన్, తట్రకల్లు**

సమాధానం: నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తాం. - **వలల్లి, సర్పంచి**

సమస్య: కొత్త కడమలకుంట - పాత కడమలకుంటకు వెళ్లే రహదారి గుంతలు పడి ఇబ్బందిగా ఉంది. - **సుధాకర్, కడమలకుంట**

సమాధానం: రహదారి దుస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అనుమతులు రాగానే ఏర్పాటు చేస్తాం. - **సుదీప్, సర్పంచి**

సమస్య: తిప్పనపల్లిలో సాయిబాబా గుడి దాటాక వచ్చే మలుపులో వేగనిరోధకాలు వేయించాలి. - **గోవిందరెడ్డి**

సమాధానం: ఆర్‌అండ్‌బీ ఇంజినీరుతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. - **మల్లికార్జున, కార్యదర్శి**

సమస్య: శెట్టూరు చెరువు కట్ట కింద విద్యుత్తు స్తంభాలు ప్రమాదకంగా ఉన్నాయి. - **ఈరణ్ణ**

సమాధానం: మరమ్మతులు చేయిస్తాం. వెంకటపతి, లైన్‌ఇన్‌స్పెక్టర్

- వజ్రకరూరు, శెట్టూరు, న్యూస్‌టుడే

ఎమ్మెల్యే సురేంద్రబాబుకు శుభాకాంక్షల వెల్లువ



అన్నదానం చేస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా లండన్‌లోని ఎన్నారై వెల్ఫేర్ సొసైటీ వారిచే గ్లోబల్ ఇండియన్స్‌కి అందించే ప్రతిష్టాత్మకమైన మహాత్మాగాంధీ లీడర్‌షిప్ అవార్డును ఆక్స్‌ఫర్డ్ మేయర్ మైక్ రోలే, ఎన్ఆర్ఐ వెల్ఫేర్ సొసైటీ అంబాసిడర్ జడ్జ్ డాక్టర్ అజిత్ స్వరణ్ సింగ్ చేతుల మీదుగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు యూకేలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ మ్యూజియంలో ఈనెల 2న అందుకున్నారు. అవార్డు అందుకున్న ఎమ్మెల్యేకు నియోజకవర్గ ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యేకు అవార్డు రావటంతో గురువారం తెదేపా నాయకులు సూర్య, మాజీ మున్సిపల్ ఛైర్మన్ వైపీ రమేశ్, రామ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అన్నదానం చేశారు.

కూలీ ఆత్మహత్య

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెంది ఓ కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చెలిమేపల్లి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (31) బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత ఐదేళ్లుగా ఆరోగ్యం సరిగాలేక పనికి వెళ్లలేని పరిస్థితిలో కుటుంబ పోషణ కోసం సుమారు రూ.2 లక్షలు అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం లేక జీవిత్తంపై విరక్తి చెంది ఇంట్లో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య అంబిక, కుమార్తెలు వర్ష, వనిత, కుమారుడు వికాష్‌బాబు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన అంజలి, ఆమె కుమార్తె చిన్నారి పుష్పకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరించారు.

తల్లిపై తనయుడి దాడి

విడపనకల్లు(ఉరవకొండ), న్యూస్‌టుడే: తల్లిపై తనయుడు దాడి చేసిన ఘటన విడపనకల్లు మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలిలా.. మండలంలోని కరకముక్కల గ్రామానికి చెందిన నాగవేణి భర్త కొన్నేళ్ల కిందట మృతిచెందాడు. ఆమెకు కొడుకు, కూతురు ఉండగా, కొడుకు వద్ద ఉంటోంది. కుమారుడు అశోకచక్రవర్తి 22 ఎకరాల భూమిని తల్లికి తెలియకుండా చేసుకున్నాడు. ఇతర ఆస్తులను దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై తనపై దాడి చేస్తున్నాడని తల్లి నాగవేణి వాపోయారు. గురువారం ఇంటి వద్ద తనపై అకారణంగా దాడి చేసి గాయపరిచినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని ఉరవకొండ గ్రామీణ సీఐ ప్రవీణ్‌కుమార్, పాల్తూరు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితురాలు చెప్పారు.


అధ్యాపకుల నిర్లక్ష్యం తగదు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు నిర్వహించే అంతర్గత పరీక్షల మార్కులు వేయడంలో అధ్యాపకులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆర్‌జేడీ నాగలింగారెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం, బోధనా అభ్యసన ప్రక్రియ నమోదు, డీజే లాకర్, ఆయుష్మాన్ భారత్ తదితర అంశాలపై చర్చించారు. త్వరలో న్యాక్ బృందం కళాశాలను సందర్శించనున్న నేపథ్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రిన్సిపల్ రఘురామమూర్తి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు నారాయణ, గోవర్దన్, కోదండరాములు, బాబు, దొడ్డనాగప్ప, ఫరీషా పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగలింగారెడ్డి

ఉత్తమ సేవలతో గుర్తింపు



ఎంపీడీవో విజయలలితకు సన్మానిస్తున్న టీఏ హరికృష్ణ

వజ్రకరూరు, న్యూస్‌టుడే: ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ కర్నూలు జిల్లాలోని హోలగుంద మండలానికి బదిలీపై వెళ్లిన విజయలలితకు గురువారం ఉపాధి సిబ్బంది, పంచాయతీ రాజ్ అధికారులు ఘనంగా సన్మానించారు. ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించి, సక్రమంగా విధులు నిర్వహించినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం టీఏ హరికృష్ణ జ్ఞాపికను అందజేశారు.

బెళుగుప్ప: ఎంపీడీవో రామచంద్రయ్య, పంచాయతీ రాజ్ జేఈ సుధాకర్ సేవలు మరువ లేనివని తెదేపా మండల కన్వీనర్ ప్రసాద్ పేర్కొన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎంపీడీవో కళ్యాణదుర్గం, పంచాయతీరాజ్ జేఈ హీరేహాళ్‌కు బదిలీ అయ్యారు. కార్యాలయ సిబ్బంది గురువారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వారిని ఘనంగా సత్కారించారు. నాయకులు మల్లి, రాధాకృష్ణ, తిమ్మప్ప పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి



పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం ప్రతినిధులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఇష్టానుసారంగా ఉందని, కట్టడి చేయాలని వార్డు సభ్యుడు చేజాల ప్రభాకర్ కోరారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచి లలితమ్మ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టణంలో వివిధ రూపాల్లో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. లత్తవరంలో వీరశైవ రుద్రభూమిలో మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వార్డు సభ్యుడు పాటిల్ నిరంజన్‌గౌడ్, వీరశైవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. నీటి సదుపాయంతో పాటు విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు.



రాయదుర్గం: లలితా దేవి అలంకరణలో..



కంబదూరు: అలంకరణలో పార్వతీదేవి



ఉరవకొండ: బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో..



కణేకల్లులో..



బొమ్మనహాళ్.. అలంకరణలో గ్రామదేవత

అంబ పరమేశ్వరీ.. అఖిలాండేశ్వరి



రాయదుర్గం గ్రామీణం: బొమ్మక్కపల్లిలో..

శరన్నవరాత్రులను పురస్కరించుకుని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, బృందం



ఉరవకొండ: జగదీశ్వరమ్మ ఆలయంలో హోమాల నిర్వహణ

వేధింపులపై కేసు నమోదు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామంలో వివాహితను వేధింపులకు గురి చేసిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. తన కోర్కెను తీర్చాలని వేధించాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

ఎంఈవోగా మహమ్మద్ గౌస్

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండల విద్యాధికారిగా మహమ్మద్ గౌస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం అనంత నగరపాలక సంస్థలోని ఒకటో నెంబరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. పూర్తి అదనపు బాధ్యతలు కింద ఆయన్ని ఉన్నతాధికారులు ఇక్కడ నియమించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంఈవో చంద్రశేఖర్ ఇటీవల ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే.

ప్రయాణం.. ప్రమాదకరంగా



పలుచోట్ల రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది మృతి చెందుతున్నా.. జనంలో మార్పు రావడం లేదు. గురువారం సాయంత్రం కూడేరు మండలం శివరాంపేట సమీపంలో వేరుసెనగ నూర్పిడి చేసే యంత్రంపై కొందరు కూలీలు ప్రమాదకరంగా ప్రయాణిస్తూ కనిపించారు. పొరబాటున జారితే కిందకు పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం లేకపోలేదు. ఇలా ప్రాణాల మీదకు తెచ్చుకునే పరిస్థితిని చూసి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహన చోదకులు, ప్రయాణికులు చర్చించుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, ఉరవకొండ

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు



విద్యుత్తు లేని సమయాల్లో సేవలకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వ కార్యాలయాలకు లక్షలాది రూపాయలు వెచ్చించి జరేటర్లు ఏర్పాటు చేశారు. సుమారు పదేళ్ల కిందట కళ్యాణదుర్గం తహసీల్దారు కార్యాలయం, పాత పాలశీతలీకరణ కేంద్రం వద్ద రూ.లక్షలు వెచ్చిన జనరేటర్లు వృథాగా ఉండిపోయాయి. వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పుపట్టాయి. ప్రజాధనం వృథా అయిందని పలువురు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆయా శాఖల అధికారులను వివరణ కోరగా తమకు తెలియదని జారుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

దిమ్మెను బాగు చేయరూ



పట్టణంలోని కోట వీధిలోని బాలికోన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన శ్రీరామరెడ్డి నీటి పథకం నల్లాల దిమ్మె అధ్వానంగా మారింది. నాలుగు నల్లాలు ఉండగాల్సి ఉండగా ఒక దాంట్లోనే నీరు వస్తున్నాయి. దిమ్మె ఎక్కడికక్కడ ధ్వంసమైంది. నీటిని పట్టుకొనేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్‌ను వివరణ కోరగా దిమ్మెను మరమ్మతు చేసి, నల్లాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

పురవాసులకు ఊరట

- పురపాలక సంఘం: రాయదుర్గం
- జనాభా: 70 వేలు
- మొత్తం వార్డులు: 32
- ఇంటింటి చెత్త సేకరణకు నిర్ణయించిన మొత్తం నెలకు: రూ.60
- చెత్తసేకరణ ద్వారా నెలకు వసూలయ్యే మొత్తం: రూ. 9.60లక్షలు



మున్సిపల్ కార్యాలయం వద్ద మూలకు చేరిన ఆటోలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం చెత్త పన్ను వసూలుకు ఆ పార్టీకి చెందిన మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో ఏకగ్రీవంగా తీర్మానం చేయించినా స్వచ్ఛాంధ్రప్రదేశ్.. కార్పొరేషన్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణకు డీజిల్ ఆటోలు రాకపోవటంతో రాయదుర్గం పురపాలక సంఘాన్ని చెత్త పన్ను విధింపు నుంచి మినహాయించారు. రాయదుర్గం పట్టణంలో ఇంటికి రూ.60 చొప్పున నెలకు రూ. 9.60 లక్షలు వసూలు చేసేందుకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. చెత్త సేకరణకు 10 ఈ-ఆటోలను సరఫరా చేసినా అవి చెడిపోయి మూలనపడ్డాయి. పలుమార్లు మరమ్మతులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోక పోవటం, బకాయిలు ఎలా చెల్లించాలో కూడా తెలియకపోవటంతో చెత్త పన్ను నుంచి దుర్గం వాసులకు విముక్తి లభించింది. పట్టణంలో ఇంటింటి చెత్త సేకరణ కూడా మొక్కుబడిగా జరుగుతోంది. చెత్తపన్ను వసూలు చేస్తే ఎక్కడ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందోనని మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం చెత్త పన్నును ప్రభుత్వం రద్దు చేయటంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శిలఫలకాల ధ్వంసం

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలం కమ్మూరులోని గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రం, ఆర్‌ఎస్‌కేలకు చెందిన శిలఫలకాలు ధ్వంసమయ్యాయి. ఏడాది కిందట అప్పటి అధికారులు ప్రారంభించి, శిలఫలకాలను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు స్థానికులు గుర్తించారు. గుర్తించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి వివేకానందరెడ్డి కూడేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఏఈగా సలీం బాధ్యతలు

శెట్టూరు: శెట్టూరు మండల విద్యుత్తు శాఖ ఏఈగా సలీం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఏఈ జయకృష్ణ కళ్యాణదుర్గం బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న సలీం ఇక్కడికి బదిలీపై వచ్చారు.

గోదాము నిర్మాణ పనులు జరిగేనా?



ఆగి పోయిన నిర్మాణం

ఉరవకొండ, న్యూస్‌టుడే: మండలంలోని నింబగల్లులో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఏడాదిన్నర కిందట బహుళార్థక రైతు సేవా గోదాము నిర్మాణాన్ని రూ.40 లక్షల నాబార్డు నిధులతో చేపట్టారు. ఉరవకొండ పీఏసీఎస్ పరిధిలోకి వస్తుంది. దాని పరిధిలో 572 మంది రైతులు ఉన్నారు. గ్రామ పరిధిలో 2 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. గోదాము నిర్మాణం పూర్తయితే వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ ఉంచుకోవడానికి అవకాశం ఉంటుంది. ఆరు నెలలుగా అసంపూర్తిగా ఆగిపోయింది. ప్రస్తుతం దానిని కొందరు గొర్రెల కాపరులు వినియోగించుకుంటున్నారు. ఇప్పటికే దాని నిర్మాణానికి సంబంధించి దాదాపు 75 శాతం బిల్లులు కూడా మంజూరైనట్లు తెలిసింది. ముళ్లపొదలు పెరగడంతో పాటు గోడలకు ప్లాస్టింగ్ చేయక సిమెంట్ ఇటుకల నాణ్యత దెబ్బతింటోంది. సకాలంలో పూర్తి చేయకపోతే, ప్రారంభానికి ముందే నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది. ఆ దిశగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిని పీఏసీఎస్ సీఈవో గౌస్ దృష్టికి తీసుకెళ్లగా.. గోదాము నిర్మాణాన్ని ఏఎంసీ అధికారులు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.


ఎంపీడీఓకు స్వాగతం పలుకుతున్న కార్యాలయ సిబ్బంది

గార్లదిన్నె ఎంపీడీవోగా యోగానందరెడ్డి

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నె మండల నూతన ఎంపీడీఓగా యోగానందరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న విజయ భాస్కర్ సత్యసాయి జిల్లా మదిగుబ్బకు బదిలీ కావడంతో పుట్లూరు ఎంపీడీఓగా ఉన్న యోగానందరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

గుంతకల్లు

• గుంతకల్లు • శింగనమల • తాడిపత్రి

ఆముదంలో యాజమాన్య పద్ధతులు


ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఆముదం పంటలో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిశోర్‌రెడ్డి తెలిపారు. గురువారం శాస్త్రవేత్తల బృందం ఆముదం పంట పొలాలను సందర్శించారు. నత్రజని ఎరువులను అధికంగా వాడితే పంటకు పచ్చదోమలు ఆశించి రసం పీల్చడం వల్ల గింజల నాణ్యత తగ్గుతుందన్నారు. శాస్త్రవేత్తలు నారాయణస్వామి, ఉమాదేవి రైతులు పాల్గొన్నారు.

రోస్టర్ పద్ధతి పాటించాలి

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు ఎంపికలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ రోస్టర్ పద్ధతిని పాటించాలని సీపీఎం నాయకుడు కోరారు. ఈమేరకు గురువారం ఎంఈడీఓ శ్రీకాంత్ చౌదరికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కారు, లారీ ఢీ.. ఇద్దరికి గాయాలు

బత్తలపల్లి: బత్తలపల్లి సమీపంలోని రింగ్ రోడ్డు మలుపు వద్ద కారు, లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్దపప్పూరు మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన కోనంకి రామాంజనేయులు, కోనంకి అరుణ్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కున్న ఇద్దరిని బయటకు తీసి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

రహదారి ప్రమాదంలో యువకుడి మృతి

అడ్డాకుల, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి గాయపడిన వ్యక్తి మృతిచెందిన ఘటన అడ్డాకుల మండలం పరిధిలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా కిష్టాపురం గ్రామానికి చెందిన సాధిక్ వలి(27), షేక్‌దాదు ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బుధవారం సాయంత్రం బయలుదేరారు. అడ్డాకుల సమీపంలోకి చేరుకోగానే వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి రహదారి కిందకు దూసుకువెళ్లింది. ప్రమాదంలో సాధిక్ వలికి తీవ్ర గాయాలు కాగా షేక్‌దాదు స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాధిక్ వలి పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు కర్నూలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. సాధిక్ వలి భార్య హరీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై దాడి.. కేసు నమోదు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: పులగుట్టపల్లి పెద్దతండా గ్రామానికి చెందిన రంగానాయక్, చిన్న రంగానాయక్‌లపై అదే గ్రామానికి చెందిన మీటు నాయక్ దాడి చేశారు. ఈ ఘటన గురువారం జరిగింది. రంగా నాయక్ పేరిట పెద్దల ద్వారా సంక్రమించిన భూమిలో రోడ్డు వేయాలని ప్రయత్నించగా అడ్డుచెప్పడంతో మీటు నాయక్ వారి కుటుంబ సభ్యులు తమపై దాడి చేశారని బాధితులు వాపోయారు. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడిలో రంగానాయక్ తలకు, కాలికి తీవ్ర గాయాలవ్వగా, చిన్న రంగానాయక్ స్వల్పంగా గాయపడ్డారని రూరల్ పోలీసులకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోరాటాల ఫలితంగానే చెత్త పన్ను రద్దు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చెత్త పన్ను రద్దు చేయడం సీపీఎం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం గుంతకల్లు పట్టణంలో పార్టీ కార్యాలయంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం 196, 197, 198, జీవోలను తెచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటా చెత్తపన్ను నెలకు రూ.60, హోటళ్లు, షాపింగ్ మాల్స్‌కు అధికంగా చెత్తపన్నును వసూలు చేశారన్నారు. చెత్తపన్నును వ్యతిరేకిస్తూ పట్టణంలో పాదయాత్ర, దీక్షలు చేపట్టామన్నారు. నాయకులు రమేష్, నాగరాజు, సురేంద్ర, తిమ్మప్ప పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: కసాపురం అనుబంధ ఆలయమైన శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో దేవిశన్నవరాత్రులను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవిశాలక్షి అమ్మవారికి వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి అభిషేకం, అలంకరణ, సూక్త విధాన పూజ, సహస్రనామం వంటి పూజ కార్యక్రమాలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వాణి, అధికారులు, అర్చకులు, వేద పండితులు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితులు.. దిగాలుగా రైతులు

నిట్టనిలువునా ఎండుతున్న పంటలు


ఎండిన వేరుసెనగపంటతో రైతు రంగారెడ్డి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు సాగుచేసిన పలుపంటలు నిట్టనిలువునా ఎండుతున్నాయి. ఎంతో ఆశతో సాగుచేసిన వేరుసెనగ, పత్తి, కొర్రపంటలు వర్షాలు లేక కొండూరు, వీరన్నపల్లి, నాగలాపురం, కొట్టాలపల్లి తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోవడంతో రైతులకు తీవ్ర నష్టాలను తెచ్చిపెడుతున్నాయి. వరుణుడి కోసం రోజు అన్నదాతలు ఎదురుచూస్తున్నా కరుణించకపోవడంతో వేసిన పంటలు వాడుదశకు చేరాయి.

పరిస్థితి దయనీయం

ఆరుగాలం కష్టించి పండించే పంటలకు చేతికందే సమయంలో వర్షాలు పడకపోవడం వల్ల పెట్టిన పెట్టుబడులు, దిగుబడులు నష్టపోతున్నామని కొండూరుకు చెందిన రైతులు ఆవేదన చెందుతున్నారు. కొండూరు గ్రామమే కాకుండా పలు గ్రామాల్లో వేరుసెనగ పంట పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కనీసం దిగుబడులు వస్తాయోరావో కూడా తెలియని పరిస్థితి మండలంలో నెలకొంది. ఏటా వేరుసెనగ పంట చేతికొచ్చే సమయానికి పంటను నష్టపోవాల్సి వస్తోందని పలువురు రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

హెచ్చెల్సీ నీటిని విడుదల చేయాలి


మండలానికి ఉత్తర కాలువ హెచ్చెల్సీ నుంచి సాగునీటిని అందించి ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితుల నుంచి పంటలను కాపాడుకునేందుకు అధికారులు, పాలకులు రైతులకు సహకరించాలని మండల రైతులు కోరుతున్నారు. సాగునీటి ద్వారా కొంతవరకైనా పంటలను కాపాడుకోవచ్చని పలువురు రైతులు అధికారులకు విన్నవిస్తున్నారు.

వేరుసెనగకు నష్టం



ఈఏడాది ఖరీఫ్‌లో వర్షాలు బాగానే పడ్డాయని వేరుసెనగ పంటను మూడున్నర ఎకరాల్లో వేశా. ప్రస్తుతం పంట ఊడలు దిగే సమయంలో వర్షాలు లేక ఎండిపోతోంది. పంటకు ఇప్పటి వరకు రూ.50వేలు పెట్టుబడులు పెట్టినా ఒక్కవిత్తనం వచ్చేలా కనిపించలేదు. ఎండుతున్న పంటను చూడలేక పొలాల వద్దకే వెళ్లడం మానేశా. **- సురేంద్రనాథరెడ్డి, కొండూరు**

ఐదెకరాల్లో పత్తి ఎండింది



ఖరీఫ్ పంటలకు సరైన అదును సమయంలో వర్షాలు లేక ఐదెకరాల్లో సాగుచేసిన పత్తిపంట వాడు దశకు చేరింది. పంటలకు నీటితడులను మోటారు ద్వారా అందించేందుకు సమీపంలో వాగులు, వంకలు కూడా లేవు. **- లోహితేశ్వరరెడ్డి, కొండూరు**

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లులోని కూరగాయల మార్కెట్, మున్సిపల్ కాంప్లెక్స్ సీ బ్లాక్ పక్కన స్లాబ్ నుంచి సిమెంటు పెచ్చులూడుతున్నాయి. **- మోహన్**
సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- హరికృష్ణ, ఏఈ**
సమస్య: గుంతకల్లులోని మోదీనాబాదు, పాతగుంతకల్లు తదితర ఏరియాల్లో పందుల బెడద ఎక్కువగా ఉంది. **- పద్మ, గుంతకల్లు**
సమాధానం: పందుల యజమానులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. **- చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** – న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

స్పందనకు వందనం

గుంతకల్లు పట్టణం: పట్టణంలోని పోలీస్ స్టేషన్ పక్కన ఉండే ప్లాట్లల్లో చెత్తను తీసుకెళ్లడం లేదని 'మేమున్నాం. ..మీకు తోడుగా' శీర్షికతో ఈనెల 2న వార్త రావడంతో అధికారులు స్పందించారు. సచివాలయ శానిటేషన్ అధికారులు స్పందించారు. కార్మికులను పంపి చెత్తను తరలించారు.

దివ్యాంగులకు మందుల అందజేత


మందులు అందజేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంస్థ సభ్యులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మండలంలోని ఆవుల తిప్పాపల్లి గ్రామం వద్ద ఉన్న జీవనాలయంలోని మానసిక దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఔషధ పంపిణీ చేశారు. ఆశ్రమంలో కొన్ని రకాల మందులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి వారికి సౌకర్యంగా సంస్థ ఆధ్వర్యంలో వారికి కావాల్సిన అత్యవసర ఔషధాలను సంస్థ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గుర్రప్ప, కన్వీనర్ శంకర్ సభ్యులు కరుణాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

శింగనమల: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శింగనమల మండల పరిధిలోని వాగులు, వంకల్లో ఇసుకను అక్రమంగా తరిస్తున్నారన్నారు. తరచూ కేసు నమోదు చేస్తున్నా ఇసుకను తరలించడం మానలేదని తెలిపారు. ఇక నుంచి ఇసుకను తరలిస్తే వాహనాలు జప్తు చేసి ఆయా యజమానులపైన కేసులు నమోదు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సీఐ కౌలుట్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు.. ప్రమాదాలు జరిగేట్టు!



బుక్కరాయసముద్రం నుంచి నార్పలకు వెళ్లే రహదారిలో బొమ్మలాటపల్లి సమీపంలో ఉన్న కల్వర్టుకు రక్షణ దిమ్మెలు ధ్వంసమయ్యాయి. నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉన్న ఈ రహదారిలో కల్వర్టు మీద రక్షణ దిమ్మెలు లేక ప్రమాదకరంగా మారింది. రాత్రివేళల్లో ప్రయాణిస్తున్న వాహనదారులకు మరింత ఇబ్బందికరంగా మారింది.

-చిత్రం: ఈనాడు, అనంతపురం, బుక్కరాయసముద్రం

మొక్కజొన్న రైతుకు కష్టకాలం



వాతావరణ పరిస్థితుల కారణంగా మొక్కజొన్నలో తేమశాతం తగ్గకపోవటంతో రైతులు పంట దిగుబడిని రహదారిపై ఆరబోసుకుంటున్నారు. మామూలుగా బాగా ఎండిపోయిన మొక్కజొన్నను కోళ్లమేత కోసం కొనుగోలు చేస్తారు. ఏమాత్రం తేమ ఉన్నా దిగబడి పాడయిపోతుంది. ప్రస్తుతం జిల్లాలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవటంతో పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట వద్ద రహదారికి ఒక్కపక్కన మొక్కజొన్న దిగుబడిని ఇలా ఆరబోశారు.

-చిత్రాలు : ఈనాడు, అనంతపురం, పెద్దపప్పూరు

ఉపతహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా నారాయణ స్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కంబదూరులో డీటీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జి డీటీ సువర్ణ రాప్తాడుకు బదిలీపై వెళ్లారు.


★ **గార్లదిన్నె:** గార్లదిన్నె మండల ఉప తహసీల్దార్‌గా గురువారం మల్లికార్జున బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

విధుల్లోకి చేరిన వీఆర్వోలు

గార్లదిన్నె: గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయంలో పలు రెవెన్యూ గ్రామాలకు నూతన వీఆర్వోలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పీరిలో శివరాం గ్రామానికి అమరనాథ్‌రెడ్డి, గార్లదిన్నెకు రవిశంకర్, కోటంకకు హరికృష్ణ, కల్లూరుకు రవికాంత్ వీఆర్వోగా బాధ్యతలు స్వీకరించారు.

జగన్మాతా నమోనమః

వైభవంగా దేవీ నవరాత్రులు


గుంతకల్లు పట్టణం: కన్యకాపరమేశ్వరి ఆలయంలో


గుత్తిలో.. జగదాంబ దేవి


తాడిపత్రిలో.. రాజరాజేశ్వరిదేవి


పామిడిలో.. అంబాభవాని


పామిడిలో రాజరాజేశ్వరీ దేవి

గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో దేవీ శరన్నవ రాత్రులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయాలన్నీ విద్యుత్తు దీపాల వెలుగులతో కళకళలాడాయి. **- న్యూస్‌టుడే బృందం**


గుంతకల్లు పట్టణం: కన్యకాపరమేశ్వరి ఆలయంలో


కల్లూరులో కన్యకాపరమేశ్వరి


గుంతకల్లు పట్టణం: బాలత్రిపుర సుందరీదేవి


యాడికి భైరవకొండపై బాలత్రిపుర సుందరీదేవి


పెద్దపప్పూరులో చౌడేశ్వరీదేవి

అలరించిన చిన్నారుల నృత్యం


నృత్యం చేస్తున్న చిన్నారులు

గుత్తి, న్యూస్‌టుడే: శారద శంకర మఠంలో గురువారం గుత్తికి చెందిన చిన్నారులు భరత నాట్యంతో అలరించారు. శారదామాతకు నృత్య నిరాజనం పలికారు. శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చిన్నారుల నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతపురంలోని శారద శంకర మఠం నిర్వాహకులు నృత్యంలో ప్రతిభ చాటిన చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు ఇచ్చారు. నృత్యదర్శకుడు సురేశ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డికి అపూర్వ స్వాగతం


గుత్తి జాతీయ రహదారిపై భారీ కాన్వాయ్‌తో ర్యాలీగా వస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, యల్లనూరు, యాడికి, పుట్లూరు, పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: రెండు నెలల తరువాత తాడిపత్రికి వచ్చిన జేసీ ప్రభాకర్‌రెడ్డికి పుట్లూరు, యల్లనూరు, పెద్దవడుగూరు, యాడికి, రాయలచెరువు తదితర మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా స్వాగతం పలికారు. గుత్తి మండలం జాతీయ రహదారి పక్కనే ఉన్న బాటసుంకులమ్మకు మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీగా కాన్వాయ్‌తో రాయలచెరువు, ఇగుడూరు, చుక్కలూరు, సజ్జలదిన్న, తాడిపత్రి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు కూడలిలో తెదేపా సీనియర్ నాయకుడు చింబిలి వెంకటరమణ గజమాలతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి సీబీ రోడ్డు మీదుగా ప్రజలకు అభివాదం తెలుపుతూ జేసీ ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు. సుమారుగా 20 వేల మంది కార్యకర్తలకు ఆయన విందు భోజనం ఏర్పాటు చేశారు.

ఎన్నాళ్లీ అగచాట్లు


టీబీ రోడ్డులో రైలు గేటు వేయడంతో బారులు తీరిన వాహనాలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు ఎక్కువ అవుతోంది. టీబీ రోడ్డులో డీఎంఎం రైలు గేటు వేసినప్పుడు రైలు వెళ్లేసరికే పది నిమిషాలు నుంచి 20 నిమిషాలు వరకు సమయం పడుతోంది. అప్పటి వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. అత్యవసర పనుల మీద వెళ్లే వారికి తిప్పలు తప్పడం లేదు. ఆసమయంలో అంబులెన్స్ వచ్చినా ఆగాల్సిందే. వంతెన నిర్మాణానికి ఎప్పుడు మోక్షం కలుగుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కల్యాణి అథ్లెటిక్స్ 800 మీటర్ల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీలు సరోజ, శంకుతల, శ్యామల గురువారం తెలిపారు. అనంతపురం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా పోటీల్లో ప్రతిభ చాటిన కల్యాణి రాష్ట్ర పోటీలకు ఎంపికైందన్నారు. రాష్ట్ర పోటీల్లో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.

రక్తదానంతో సంపూర్ణ ఆరోగ్యం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న వర్సిటీ విద్యార్థులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రక్తదాన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సేకరించిన రక్తాన్ని అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ఇవ్వడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ కోరి తెలిపారు. గురువారం జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా వర్సిటీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. 75 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆచార్యులు గరికపాటి గురజాడ, ఆచార్యులు దీపాంకర్ డే, శ్రేయ, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బుక్కరాయసముద్రం: అర్హత ఉన్న ప్రతి రైతుకూ ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు, రాయితీలు అందిస్తామని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. గురువారం ఆమె భద్రంపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఏవో శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది మునికుమార్, జ్యోత్స్న, నేత్రావతిపాల్గొన్నారు.

స్వచ్ఛతకు పాతర

కసాపురంలో పడకేసిన పారిశుద్ధ్యం


కాలువలు నిండి రోడ్లపై పారుతున్న మురుగు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: గుంతకల్లు మండలంలోని కసాపురం గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలో ఏ వీధికెళ్లినా చెత్త నిల్వలు, రహదారులపై మురుగు ప్రవాహం, కాలువల్లో కదలని మురుగుతో జనం ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో 4 వేలకు పైగా జనాభా ఉంది. గుంతకల్లుకు మూడు కి.మీ.ల దూరంలో ఉన్న నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో అపరిశుభ్రత ఉండటంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

గత వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యం

వైకాపా ప్రభుత్వంలో పంచాయతీల నిర్వాహణకు నిధులు మంజూరు చేయలేదు. సర్పంచుల చేతుల్లో చిల్లిగవ్వలేకపోవడంతోనే పంచాయతీల్లో చెత్త ఊడ్చే పరిస్థితి కూడా కానరాలేదు. తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు మంజూరు చేసినా అధికారులు వాటిని ఖర్చు పెట్టనీయడం లేదన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలకు చేపట్టాలని ఆదేశించినా ఆ పనులు సరిగా చేయలేదన్న విమర్శలున్నాయి.

రోగాలు ప్రబలుతున్నాయి



కాలువల్లో మురుగు నిల్వలు పేరుకుపోయి చాలా కాలమైంది. ఇళ్లల్లో ఉండాలంటే దుర్వాసనతో పాటు దోమలు బెడద అధికంగా ఉంది. రోగాల బారిన పడుతున్నాం. రోగాలతో వృద్ధులు, చిన్నారులు మంచం పట్టినా ఎవరికీ పట్టడం లేదు. **-లక్ష్మీదేవి, కసాపురం**

సమస్యను పరిష్కరిస్తాం

-శ్రీకాంత్ చౌదరి, ఎంపీడీఓ

పంచాయతీల్లో పనులు చేయించడానికి నిధులు విడుదలయ్యాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచి సహకారంతో పనులు చేయించాల్సి ఉంది. వీలైనంత త్వరగా విచారించి సమస్యకు పరిష్కారం చూపుతాం.

మురుగు కాలువలు అధ్వానం


వ్యర్థాలతో నిండిపోయిన కాలువ

యాడికి: రాయలచెరువులో జాతీయ రహదారి పక్కన ఉన్న మురుగు కాలువలో పూడిక తీయకపోవడంతో చెత్తాచెదారం, మట్టితో నిండిపోయి మురుగు రోడ్డుపైకి వస్తున్నాయి. కిరాణ దుకాణం నుంచి ఉన్నత పాఠశాల వరకు సమస్య ఏర్పడింది. కాలువ వెంట వివిధ రకాల దుకాణాలు ఉండటంతో మురుగుతో దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుద్ధ్య కార్మికులు తూతూమంత్రంగా పూడిక తీసి వెళ్తున్నారని జనం ఆరోపిస్తున్నారు. కాలువలపై బండలు ఏర్పాటు చేసి, మురుగు పారేందుకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అరుణ్ స్పందిస్తూ గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

అనంతపురం

● అనంతపురం ● రాప్తాడు



యల్లమ్మకు పూజలు

రాప్తాడు: రామగిరి మండలం వెంకటాపురంలో వెలసిన యల్లమ్మ అమ్మవారు దసరా శరన్నవరాత్రుల ఉత్సవంలో భాగంగా బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సూచనలు పట్టవేమీ?



నగరంలో ఆర్టీసీ బస్టాండు నుంచి గుత్తి రోడ్డులోకి కలిసే చోట వాహనాలు ప్రమాదకరంగా మలుపు తిరుగుతున్నాయి. అక్కడ మూడు వైపులా నుంచి ప్రయాణించే వాహనాలు ఆగిపోతున్నాయి. ఆ కూడలిలో ట్రాఫిక్ పోలీసులు సోలార్‌తో పనిచేస్తే సిగ్నల్‌ను ఏర్పాటు చేశారు. అయినా అవేమీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా దూసుకెళ్తున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

- న్యూస్‌టుడే, అనంత నేరవార్తలు

వ్యవసాయం లాభసాటి కావాలి

రాప్తాడు, న్యూస్‌టుడే : వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని ఎన్డీయే ప్రభుత్వం లక్ష్యం అని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం పొలం పిలుస్తుంది. కార్యక్రమం రాప్తాడులో నిర్వహించారు. నూతన వ్యవసాయ పద్ధతులను మెలకువలు అధికారులు రైతులకు తెలియజేస్తూ లోపాలను గుర్తించారు. పంట దిగబడి తగ్గడానికి గల కారణాలను రైతులకు వివరించారు.

అరగంట వర్షం.. అతలాకుతలం



వర్షపు నీటిలో వాహన చోదకుడి కష్టాలు

నగరంలో గురువారం రాత్రి అరగంట పాటు కురిసిన వర్షం నగర ప్రజలను అతలాకుతలం చేసింది. కొనుగోలుదారులు దుకాణాలకు చేరుకున్నాక వర్షం రావడంతో చాలాసేపు అక్కడే ఆగిపోయారు. శరన్నవ రాత్ర వేడుకల్లో భాగంగా పిల్లలు, పెద్దలు ఆలయాల్లో దర్శనం కోసం వచ్చి ఇంటికి తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. నగరంలోని సప్తగిరి కూడలి నాలుగు వైపులా భారీగా నీరు నిలబడింది. రాంనగర్‌లోని అంబేడ్కర్ ఉపరితల వంతెన కింద నీరు భారీగా నిలబడి వాహనాల రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. **- న్యూస్‌టుడే, అనంత నగరపాలక**



గురువారం రాత్రి కురిసిన వర్షానికి అంబేడ్కర్ వంతెన వద్ద నిలిచిన వరద

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: రాంనగర్ ఈ107/8బి స్తంభానికి చెట్టు కొమ్మలు ఉండటంతో గాలి వీస్తే నిప్పురవ్వలు పడుతున్నాయి. **- పరిసర ప్రాంత వాసులు**

సమాధానం: పరిశీలించి తగు చర్యలకు విద్యుత్తుశాఖ అధికారులకు తెలియజేస్తాం.

సమస్య: శాంతినగర్ బోర్డు సమీపంలో దారిలో ప్రధాన రోడ్డులోనే చెత్త అంతా పడేశారు. **- ప్రదీప్**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం.

- పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, అనంత నగరపాలక



సమస్య: అశోక్‌నగర్ హరిహర దేవాలయం సమీపాన రోడ్డులో రోడ్డు వెడల్పు కోసం మట్టిని తీసి దిబ్బలుగా పోశారు. వాటిని తరలించలేదు. నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మట్టిని తరలించండి. **- సులోచన, స్థానికురాలు.**

సమాధానం: పరిశీలించి త్వరలో తరలిస్తాం.

- విష్ణుమూర్తి, నగరపాలక ఎంహెచ్‌ఓ. **- న్యూస్‌టుడే: కమలానగర్**

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు తెలుసుకొని వాటికి దూరంగా ఉండాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలోని ఆర్థికశాస్త్ర విభాగంలో గురువారం మాదక ద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన సదస్సు జరిగింది. మాదకద్రవ్యాలు వినియోగిస్తే జీవితాలు నాశనమవుతాయని, యువత చైతన్యవంతులు కావాలన్నారు.

రక్తదానంతో సంపూర్ణ ఆరోగ్యం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రక్తదాన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సేకరించిన రక్తాన్ని అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ఇవ్వడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ కోరి తెలిపారు. గురువారం జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా వర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. 75 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆచార్యులు గరికపాటి గురజాడ, ఆచార్యులు దీపాంకర్ డే, శ్రేయ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇవి దారులేనా.. రూపురేఖలు మారేనా?



పరిహారం చెల్లిస్తే..

అనంత నగరం నడిబొడ్డున్నున్న సప్తగిరి కూడలి ఇది. అర్బన్ లింక్‌రోడ్డు పథకం కింద ఈ కూడలి అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ ప్రాంతంలో వాణిజ్య సముదాయాలు కొంత తొలగించాలని అధికారులు నిర్ణయించారు. ఇటీవల సంయుక్త కలెక్టర్ శివనారాయణశర్మ సప్తగిరి కూడలి, వాణిజ్య సముదాయాలు పరిశీలించారు. భవనాలు కోల్పోతున్న వారికి పరిహారం చెల్లింపుపై చర్చించారు. వివాదాలు పరిష్కారమైతే తప్ప విస్తరణ పనులు జరిగేలా లేవు.

వేణుగోపాల్‌నగర్ (అనంతపురం) న్యూస్‌టుడే: అనంత నగరాభివృద్ధిలో భాగంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారం.. వాహనదారులు, పాదచారుల ఇబ్బందులు తీర్చాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అర్బన్ లింక్ రోడ్డు పనులకు రూ.310 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో నగరంలోని బళ్లారి చౌరస్తా నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి కూడలి, కలెక్టరేట్, పంగల్‌రోడ్డు మీదుగా సమతాగ్రాం వద్ద ఉన్న ఔటర్ రింగ్‌రోడ్డు వరకూ 4 వరుసల రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

● సుమారు 10 కి.మీ మేరకు నాలుగు వరుసల రహదారి నిర్మించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జితోపాటు 4 చిన్న వంతెనలు కూడా నిర్మాణం పూర్తి చేశారు. నగరం పరిధిలో టవర్‌క్లాక్, సప్తగిరి కూడలి, ఆదిమూర్తినగర్ సమీపంలో మాత్రం రహదారి విస్తరణ పనులు పూర్తి స్థాయిలో చేపట్టలేదు.

● విశాలమైన రహదారి సంవత్సరం క్రితమే పూర్తిచేశారు. ప్రైవేటు భవన యజమానులు పరిహారం విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అర్ధాంతరంగా ఆగిన పనులు ముందుకు కదల్లేదు. టవర్‌క్లాక్ వద్ద ఒకటి, రెండుభవనాలు మాత్రమే అడ్డంకిగా మారాయి. కంకరతో బెడ్డింగ్ కూడా వేశారు. అంతటితో ఆగిపోయింది. ఫ్లైఓవర్ బ్రిడ్జి ఒకవైపు సర్వీసు రోడ్డులో వాహనాలు ప్రయాణించడానికి ఇబ్బందిగా ఉంది.

● ప్రైవేటు భవనాలకు పరిహారం చెల్లించడానికి కేంద్రం అదనంగా రూ.28 కోట్లు నిధులు మంజూరు చేసింది. వక్ఫ్‌బోర్డు ఆస్తులతో పాటు ప్రైవేటు వ్యక్తులకు చెందిన వాణిజ్య సముదాయాలు కూడా కొన్ని ఉన్నాయి. వాటికి పరిహారం చెల్లిస్తే రహదారి విస్తరణకు మార్గం సుగమమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇది పరిష్కారమైతే టవర్‌క్లాక్ వద్ద ట్రాఫిక్ సమస్య తీరుతుంది. జిల్లా ఉన్నతాధికారులు ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

● వాణిజ్య సముదాయాల భవనాలకు పరిహారం చెల్లింపుపై రెవెన్యూ విభాగం నుంచి స్పష్టత వస్తే సమస్య తీరుతుందని జాతీయ రహదారుల శాఖ డీఈ గిడ్డయ్య స్పష్టం చేస్తున్నారు.

పేచీలున్నాయ్..

టవర్‌క్లాక్ సమీపంలో రైల్వే వంతెన పక్కనున్న సర్వీసు రోడ్డు ఇది. వంతెన నిర్మాణం పూర్తయి ఏడాది గడచినా నిర్మాణానికి నోచుకోలేదు. ఇక్కడ కూడా కొన్ని ప్రైవేటు భవనాలు కూల్చివేయాల్సి ఉంది. కొందరు స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. మరికొందరు పరిహారం విషయంలో పేచీ పెడుతున్నారు. ఫలితంగా గుంతలమయంగా ఉన్న రోడ్డులో ప్రయాణం కష్టంగా మారింది.



చెత్తకుండీ తొలగింపు..

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: 'ఈ నెల 1న క్లస్టర్ 'పేజీలో ప్రచురించిన 'చెత్తకుండీ..పక్కన జరుగుండి' అనే వార్తకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఏజీఎస్ నగర్‌లోని స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద రోడ్డుపై ఉన్న చెత్తకుండీ తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలకు మార్గం ఇబ్బందులు తప్పాయి.

బాధ్యతల స్వీకరణ



నాగరాజు నాయుడును అభినందిస్తున్న గ్రామ కార్యదర్శుల సంఘం రాష్ట్ర నాయకులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ నూతన అధికారిగా టి.నాగరాజు నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు డీపీఓగా ఉన్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేశారు. గతంలో ఆయన డీఎల్‌డీఓగా, యువజన సంక్షేమ శాఖ సీఈఓగా, మెప్మా పీడీగా, ఎంపీడీఓగా వివిధ జిల్లాల్లో పనిచేశారు. ఇప్పటి వరకు డీపీఓగా ఉన్న కెవిఎల్ ప్రభాకర్‌రావును బాపట్ల డీజీపీఓగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నాగరాజు నాయుడును నియమించారు. గురువారం ఇద్దరూ కలెక్టర్‌ను కలిసి వచ్చారు. ప్రభాకర్‌రావు నాగరాజు నాయుడుకు బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. కొత్త డీపీఓ మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలను బాగా నడిపించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆకుతోటపల్లి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లో జరిగిన అక్రమాలపై విచారణలు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని 'న్యూస్‌టుడే' ఆయన దృష్టికి తీసుకెళ్లగా....సమగ్రంగా విచారణ జరిపించి చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు



కొత్తూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో కాశీవిశాలాక్షి, అన్నపూర్ణాదేవి, శివుడు, మధుర మీనాక్షి అలంకారం



పాతూరు అమ్మవారిశాలలో వారాహిదేవి అలంకారం



ఆత్మకూరులో..



అనంత అర్బన్ బ్యాంకులో



వెంకటేశ్వరాలయంలో చిన్నారుల నృత్యం

దేవీ దర్శనం.. చూసిన కనులకే భాగ్యం



ఉమానగర్‌లో..



హౌసింగ్‌బోర్డులో..

దసరా వేడుకల్లో భాగంగా శరన్నవరాత్రుల వేడుకలు గురువారం ప్రారంభం అయ్యాయి. తొమ్మిది రోజుల పాటు దేవతామూర్తులు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మూల విగ్రహాలు, ఉత్సవ విగ్రహాలను దర్శించుకున్న భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. అనంతపురం నగరంలోని పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. చిన్నారులు భక్తి పాటలకు నృత్యాలు చేసి ఆనంద పరవశులను చేశాయి. **- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం, తపోవనం, ఆత్మకూరు**



రైల్వే ఫీడరు రోడ్డులో..



శారదానగర్ శంకరమఠంలో



తపోవనం శ్రీవేద గాయత్రీ దేవి ఆలయంలో

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక అవసరం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకొని అమలు చేసే దిశగా అడుగులు వేయాలని ఎంపీడీవో లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పెద్దఎత్తున నీటి కుంట నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు వచ్చాయని వివరించారు.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : గంగ : **సత్యం సుందరం,** గాయత్రి : **రామ్‌నగర్ బన్నీ,** గౌతమి : **కలి, మిస్టర్ సెలబ్రిటీ,** గౌరి, త్రివేణి, ఎస్వీ సినిమాక్స్, నీలిమ : **దేవర,** తరంగిణి : **దక్షిణ,** తేజస్విని : **స్వాగ్.**

ఆముదంలో యాజమాన్య పద్ధతులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఆముదం పంటలో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిశోర్‌రెడ్డి తెలిపారు. గురువారం శాస్త్రవేత్తల బృందం ఆముదం పంట పొలాలను సందర్శించారు. నత్రజని ఎరువులను అధికంగా వాడితే పంటకు పచ్చదోమలు ఆశించి రసం పీల్చడం వల్ల గింజల నాణ్యత తగ్గుతుందన్నారు. శాస్త్రవేత్తలు నారాయణస్వామి, ఉమాదేవి రైతులు పాల్గొన్నారు.



మృతి చెందిన అన్నదాతలకు నివాళి అర్పిస్తున్న రైతు సంఘాల నాయకులు

'విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ప్రతిఘటిస్తాం'

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఎంతోమంది ఆత్మ బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే పూర్తిస్థాయిలో ప్రతిఘటిస్తామని రైతు సంఘాల నాయకులు అన్నారు. గురువారం అనంత కలెక్టరేట్ ఎదుట అఖిల పక్ష రైతు సంఘాల సంయుక్త సారథ్యంలో ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఏపీ రైతుసంఘాల జిల్లా సమితి కన్వీనర్ డి. చిన్నప్ప యాదవ్ అధ్యక్షతన సాగిన ఈ దీక్షలో సీపీఐ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సీపీఎం అనుబంధ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా రైతు కూలీ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిశ్రమ పురోగతికి ఏ మాత్రం తోడ్పాటు అందివ్వకపోగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం పదేళ్లుగా విశ్వ ప్రయత్నాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు ఏకతాటిపైకి రావాలని పిలుపు నిచ్చారు. రైతు సంఘాల నాయకులు కృష్ణ, బాలరంగయ్య, రాయుడు, నాగేశ్, రాజశేఖరశెట్టి, రామాంజి, శ్రీనివాసులు, మాధవరెడ్డి పాల్గొన్నారు.



భారీ వాహనాలతో ప్రాణ సంకటం

అనంతనగరం పలు ప్రధాన కూడలిలో ఓ భారీ వాహనం రాకతో ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. ముందు వెనుక చూడకుండా ఒక్కసారిగా ద్విచక్ర వాహనం దూసుకొచ్చింది. భారీ వాహనం తక్కువ వేగంతో రావడంతో ప్రమాదం తప్పింది. నగరంలో ఇలాంటి ప్రయాణాలకు అడ్డుకట్ట వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, అనంతపురం (కమలానగర్)

వెలగని లైట్లు.. వీధుల్లో చీకట్లు

నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగంలో విద్యుత్తు స్తంభానికి వీధిదీపం వెలగటం లేదు. రాత్రిళ్లు చీకటిలో విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రిళ్లు బయటకు రావాలంటేనే ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు సైతం చీకటిలో ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు.


- న్యూస్‌టుడే, సూర్యనగర్




ప్రమాదకరంగా తీగలు

నగరంలో పలు ప్రాంతాల్లో వైర్లకు తీగలు అల్లుకొని ప్రమాదంగా మారుతున్నాయి. ఆదిమూర్తినగర్‌లో జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లే దారిలో విద్యుత్తు తీగలకు చెట్టు కొమ్మ తీగలు అల్లుకున్నాయి. ఈ దారిలో నిత్యం వందల సంఖ్యలో పోలీసులు, ప్రజలు ప్రయాణం సాగిస్తుంటారు. గాలి వీచిన సమయంలో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న టీ దుకాణం వద్ద విద్యుత్తు స్తంభానికి విద్యుత్తు సరఫరా అయ్యే తీగ ప్రమాదంగా వేలాడుతోంది. నిత్యం తిరిగే హమాలీలు, ప్రజలు ఏ మాత్రం అజాగ్రత్త వహించినా షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

- న్యూస్‌టుడే, గుల్జార్‌పేట, కమలానగర్





విద్యాసంస్థల వద్ద ఆందోళన

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యాసంస్థలకు దసరా సెలవులు ప్రకటించినా కార్పొరేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహించడం దారుణమని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి విమర్శించారు. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు గురువారం తరగతులు నిర్వహిస్తుండంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆయా విద్యాసంస్థల వద్ద ఆందోళన చేశారు. తరగతులు రద్దు చేయించి విద్యార్థులను బయటకు పంపించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశీ, మంజునాథ్, పవన్, కార్తీక్, యశ్వంత్ పాల్గొన్నారు.

వ్యవసాయ, విద్యుత్తు పరికరాల అపహరణ

కనగానపల్లి: మండలంలోని తూంచెర్ల గ్రామంలో బుధవారం రాత్రి సమయంలో ఏకకాలంలో ముగ్గురు రైతులకు చెందిన వ్యవసాయ, విద్యుత్తు, రసాయన ఎరువులను అపహరించినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు. తూంచెర్ల గ్రామానికి చెందిన రైతులు శివారెడ్డి, రమణ, చెంద్రాయుడుల పొలాలు గ్రామానికి సమీప దూరంలో ఉన్నాయి. ప్రతి రైతు పొలంలో ఒక గదిని ఏర్పాటు చేసుకొని అందులో వ్యవసాయ పరికరాలు, విద్యుత్తు పరికరాలు, పంటలకు కావాల్సిన మందులను నిల్వ చేసుకున్నారు. గుర్తు తెలియని దుండగలు గదులకు ఏర్పాటు చేసిన తాళాలను పగలగొట్టి అందులో ఉన్న వస్తువులు, పరికరాలు, రసాయనిక ఎరువులను అపహరించారన్నారు. గురువారం కనగానపల్లి పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు.



పునాదుల స్థాయిలో ఆగిన పనులు

ఇళ్ల పట్టాలు వారివే.. అయినా అడుగు పెట్టనివ్వట్లేదు

పచ్చి టెంకాయల వ్యాపారస్తుల గగ్గోలు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: పచ్చి టెంకాయల వ్యాపారం చేసుకుంటూ పూట గడుపుతున్న పేదలు వారు. రేయనక, పగలనక వ్యాపారం చేస్తేనే బతుకు బండి నడుస్తుంది. నగరంలో అనేకచోట్ల బండ్లపై వ్యాపారం చేసుకుని పొట్టపోసుకుంటున్నారు. అద్దె ఇళ్లలో ఉంటున్న వీరికి 25 ఏళ్ల క్రితమే ఇంటి పట్టాలు మంజూరు చేశారు. వారికి ఆర్థికశక్తి లేకపోవడంతో కొన్నేళ్లపాటు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. పచ్చి టెంకాయల వ్యాపారం చేసుకుంటూ అద్దె చెల్లించలేని వారు పక్కాగృహాలు నిర్మించుకోవాలని ప్రస్తుతం ఆరాటపడుతున్నారు. కొందరు ఇంతకుముందే పునాదులు కూడా నిర్మించుకున్నారు. సజ్జల కాలువకు చెందిన ఓ వ్యక్తి వారిని భూమిలోకి అడుగుపెట్టకుండా అడ్డుకుంటున్నాడు. అటు రెవెన్యూ అధికారులకు, ఇటు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెండురోజుల క్రితం అనంతపురం గ్రామీణ డీఎస్పీని కూడా కలిసి పరిస్థితిని వివరించారు. ఆ భూమికి సంబంధించి అన్ని రికార్డులు పేదలకే అనుకూలంగా ఉన్నట్లు అధికారి గుర్తించారు.

1999లోనే మంజూరు

అనంతపురం నగరంలో ఉన్న 40 మంది పచ్చిటెంకాయల వ్యాపారస్తులకు కురుగుంట పొలం సర్వే నం.320-1లో 1999లోనే ఇంటి పట్టాలు మంజూరు చేశారు. నగరానికి దూరంగా ఉన్నందున చాలామంది ఇళ్లు నిర్మించుకోవడానికి ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం అక్కడ కాలనీలు ఏర్పడటం, రహదారుల సౌకర్యాలు మెరుగవడంతో కొందరు ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు కదిలారు. స్థానికంగా ఉన్న ఒక వ్యక్తి వారిని నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుకుంటున్నట్లు ఫిర్యాదు చేశారు. అతనికి ఎలాంటి హక్కు లేకపోయినా అడ్డుకోవడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.


మాకు రక్షణ కల్పించాలి



మాకు 25 ఏళ్ల క్రితమే ఇంటి పట్టాలు మంజూరు చేశారు. కొన్ని కారణాల వల్ల ఇల్లు నిర్మించుకోలేక పోయాం. ప్రస్తుతం అందరూ అక్కడ ఇళ్లు కట్టుకోవాలని నిర్ణయించాం. ఈ పరిస్థితుల్లో రాము అనే వ్యక్తి మాపై దౌర్జన్యం చేస్తున్నాడు. ఇతనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని మనవి.

- శంకర్, పేద వ్యాపారి

పలుమార్లు ఫిర్యాదు



కొందరు గృహనిర్మాణ సంస్థ పథకాల కింద పక్కా గృహాలు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారు. రాము వ్యక్తి మాపై దౌర్జన్యం చేస్తూ కాలనీలోకి రాకుండా అడ్డుకుంటున్నాడు. గ్రామీణ పోలీసులకు అనేకమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం కనిపించలేదు. ఎస్పీ కార్యాలయంలో కూడా అర్జీలు ఇచ్చాం.

- ఉత్తన్న, పచ్చిటెంకాయల వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు

ఆత్మకూరు ఎంపీడీవోగా లక్ష్మీనరసింహ

ఆత్మకూరు: మండల ఎంపీడీవోగా లక్ష్మీనరసింహులు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. కుందుర్పి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై ఆత్మకూరుకు వచ్చారు. ఆత్మకూరులో ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శివశంకర్ బదిలీపై కల్యాణదుర్గం ఏవోగా బదిలీపై వెళ్లారు.

యువకుడికి సాయం

గుల్జార్‌పేట: కడుపు నొప్పితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్న రాయదుర్గానికి చెందిన పేద యువకుడు మల్లికార్జునకు రూ.10 వేలు నగదు, రెండు నెలలకు సరిపడా సరకులను నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ నిర్మలమురళి, స్వధర్మ సేవా ట్రస్ట్ నిర్వాహకులు మనోజ్ అందించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బుక్కరాయసముద్రం: అర్హత ఉన్న ప్రతి రైతుకూ ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు, రాయితీలు అందిస్తామని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. భద్రంపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో పంటలను పరిశీలించారు.